
Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 29.01.2016, శుక్రవారం సంపుటి : 35 సంచిక : 35 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com




> పార్టీలో పెరిగిన క్రేజ్
> ప్రభుత్వంపై లోకేష్ ముద్ర
> జై కొడుతున్న కేడర్

## బాబును మించిన బాబు

***2014**లో తెలుగుదేశంపార్టీ అధికారంలోకి రాకముందు నారా లోకేష్ అనే యువకుడి గురించి తెలుగుదేశం పార్టీలోనే ఎవరికీ పెద్దగా తెలిసేది కాదు. ఆ అబ్బాయి బర్త్‌డే కూడా ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియదు. అసలు పట్టించుకునేవాళ్లు కూడా కాదు. కాని, ఈ టర్మ్‌లో మాత్రం పార్టీలో చంద్రబాబు కంటే లోకేష్ అనే చిన్నబాబుకే నాయకులు, కార్యకర్తలు ఘనంగా జైకొడుతున్నారు. పార్టీలో చంద్రబాబును చినబాబు మించిపోయాడనడానికి ఉదాహరణ మొన్న జరిగిన లోకేష్ జన్మదిన వేడుకలే!*

నారా లోకేష్ జన్మదిన వేడుకలను ఈసారి రాష్ట్ర వ్యాప్తంగా తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు ఓ పండుగ మాదిరిగా నిర్వహించారు. నారా లోకేష్ పేరుతో ప్రతి జిల్లాలోనూ సేవాసమితిలను, ట్రస్ట్‌లను, ఫౌండేషన్‌లను ఏర్పాటు చేసి వేడుకలను నిర్వహించడం విశేషం. ఇదంతా కూడా యువనేతను పెద్దనేతగా తీసుకొచ్చే ప్రయత్నమేనని తెలుస్తోంది. 1995 ఆగష్టులో ఎన్టీఆర్ వెన్నుపోటు ద్వారా తెలుగు దేశంపార్టీ చంద్రబాబు చేతుల్లోకి వచ్చింది. అప్పుడు ఎన్టీఆర్ కుటుంబసభ్యులు కూడా చంద్రబాబు వైపే నిలిచారు. ఆ తర్వాత ఎన్టీఆర్ కుటుంబసభ్యులను చంద్రబాబు ఒక్కొక్క రిగా నలుపుకుంటూ వచ్చాడు. బాలకృష్ణ అడ్డం తిరిగితే తనకే డేంజర్ అని భావించి తన కొడుకును ఆయనకు అల్లుడిని చేసేసి బాలయ్య కాళ్లకు బంధనాలు బిగించాడు. 2009 ఎన్నికలప్పుడు తెలుగుదేశంకు జూనియర్ ఎన్టీఆర్ ప్రచారం నిర్వహించడం తెలిసిందే! ఆ ప్రచారంలో జూనియర్ ప్రసంగాలు, దూకుడు చూసిన చంద్రబాబు ఈ పిల్లోడితో ఎప్పుడైనా ఇబ్బందేనని (మిగతా 11వ పేజీలో)



## తెలుగు అక్షరానికి...

# అత్యున్నత గౌరవం

### నిరంతర కృషీవలుడు రామోజీకి పద్మవిభూషణం

***కృ**షి ఉంటే మనుషులు ఋషులవుతారనడానికి నిలువెత్తు నిదర్శనం అతను. 'శ్రమయేవ జయతే' సూక్తికి ప్రతిరూపం ఆయన. నిత్య శ్రామికుడు... అక్షర ప్రేమికుడు... తెలుగు మీడియా మొఘల్ రామోజీరావుకు భారత ప్రభుత్వం నుండి అత్యున్నత పురస్కారం లభించడం తెలుగుజాతికే గర్వకారణం. భారతరత్న తర్వాత అత్యున్నతమైన 'పద్మవిభూషణ్' పురస్కారాన్ని 67వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా కేంద్రప్రభుత్వం ఆయనకు ప్రకటించడం... తెలుగు జర్నలిజానికి దక్కిన గౌరవంగా చెప్పుకోవచ్చు.*

ఏ రంగంలో ఎదగాలనుకున్న వారికైనా రామోజీరావు ఒక రోల్‌మోడల్. ఆయన కాలు పెట్టని రంగమంటూ లేదు. జర్నలిజంలో అక్షర సేద్యం చేస్తున్నాడు. ప్రియా ఫుడ్స్ ద్వారా వ్యాపార రంగంలో ఉన్నాడు. ఉషోదయ ఎంటర్‌ప్రైజస్ ద్వారా ఎంటర్‌టైన్‌మెంట్ రంగంలో ఉన్నాడు. కష్టపడి జీవితంలో ఎదగాలనుకునే ప్రతిఒక్కరూ చదువుకోవాల్సిన పుస్తకం రామోజీరావు. ఎందుకంటే ఆయన జీరో స్థాయి నుండి అన్ని రంగాల్లోనూ హీరోస్థాయికి ఎదిగారు. తల్లిదండ్రులిచ్చిన కోట్లు పెట్టుబడులుగా పెట్టి ఆయన ఎదగలేదు. తల్లిదండ్రులు జీవితం ఇచ్చారు. తన జీవితాన్ని సమాజానికే రోల్‌మోడల్‌గా మలచుకున్నాడు రామోజీ! 1936 నవంబర్ 16వ తేదీన కృష్ణా జిల్లా పెద్దపారంపూడి గ్రామంలో చిరుకూరి వెంకటసుబ్బారావు, సుబ్బమ్మ దంపతులకు జన్మించాడు రామోజీ! (మిగతా 11వ పేజీలో)







● లీడర్లకూ ఇసుక ఫోబియా



## సిండికేట్ అవుతున్న మాఫియా

**రా**ష్ట్రంలో మద్యం తర్వాత పెద్ద వ్యాపారం ఏంటంటే ఇసుక. చంద్రబాబు అధికారంలోకి వచ్చాక ఇసుకను సామాన్యుడికి ఇంకొంచెం అందకుండా చేశాడు. ఇసుకను పిండి కోట్లు రాబట్టాలనుకున్న చంద్రబాబు ఇసుక రీచ్‌ల విధానంలో మార్పు చేశాడు. అంతకుముందున్న టెండర్ల విధానాన్ని ఎత్తేసి ఏదో అద్భుతాలు చేద్దామన్నట్లు మహిళా సంఘాలకు ఇసుకరీచ్‌లను అప్పగించారు. మహిళా సంఘం ముసుగులో అధికారపార్టీ నాయకులు ఈ ఒకటిన్నరేడాదిలో ఇసుక ద్వారా కోట్లు గడించారు. ఈ విధానంలో ఇసుక ద్వారా ప్రభుత్వానికి వచ్చిన ఆదాయం తక్కువ, అధికారపార్టీ నాయకులు సంపాదించింది ఎక్కువ. ఇసుక ద్వారా జరగాల్సిన దోపిడీ అంతా జరిగిపోయాక రాష్ట్ర ప్రభుత్వం ఇసుక రీచ్‌లకు మళ్ళీ పాత పద్ధతిలోనే టెండర్లు పెట్టడానికి శ్రీకారం చుట్టింది. ఫిబ్రవరి 9వ తేదీలోగా ఈ-టెండర్ల ప్రక్రియను నిర్వహించడానికి నోటిఫికేషన్ విడుదల చేసింది.

జిల్లాలో 24రీచ్‌లకు నోటిఫికేషన్ విడుదల చేయగా వీటిలో 9రీచ్‌లకు మాత్రమే పర్యావరణ అనుమతులుండడం విశేషం. (మిగతా 11వ పేజీలో)

# పన్నులు కట్టొద్దంటున్న అనిల్



నెల్లూరు నగర ఎమ్మెల్యే పి.అనిల్ కుమార్‌యాదవ్ గతంలో పలుసార్లు చెప్పాడు... పనులు చేయకుంటే కార్పొరేషన్‌కు పన్నులు కట్టొద్దని. ఇప్పుడు కూడా అదే చెబుతున్నాడు. 25వ తేదీన నెల్లూరులోని ఖుద్దూస్‌నగర్, ఎర్రదర్గా ప్రాంతాలలో పర్యటించిన ఆయన అక్కడ పరిస్థితులు చూసి తీవ్రంగా స్పందించారు. నవంబర్‌లో వరదలొచ్చి ఖుద్దూస్‌నగర్ నీట మునిగినప్పుడు ఆ ప్రాంతవాసులు మునక నుండి బయటపడేందుకు కల్వర్టర్‌ను పగులగొట్టారు. మూడునెలలైనా కార్పొరేషన్ వాళ్లు ఆ కల్వర్ట్ నిర్మాణం జోలికి పోలేదు. అదీగాక ఇక్కడ వరద బాధితులకు నష్ట పరిహారం కూడా అందలేదని అనిల్ ఆరోపణ. ఈ ప్రాంతంలో కనీసం కరెంట్ కూడా లేదని, ప్రజలు చీకట్లో బ్రతుకుతున్నారని, కలెక్టర్, ఆర్డీఓ, తహశీల్దార్‌ల దృష్టికి సమస్యలను తీసుకెళ్లినా పరిష్కారం కాలేదని అనిల్ బాధను వ్యక్తం చేశారు. పనులు చేయకపోతే పన్నులు కట్టే ప్రసక్తేలేదని ఆయన ఖరాఖండీగా చెబుతున్నాడు.


# పంజరం నుండి స్వేచ్ఛాప్రపంచంలోకి...

## కేంద్ర కారాగారం నుంచి 30మంది జీవితఖైదీలు విడుదల



ఎన్నాళ్లో వేచిన ఉదయం... ఈనాడే ఎదురవుతుంటే... అన్న ఆశతో ఎన్నో ఏళ్లుగా ఆశగా ఎదురుచూస్తున్న జీవిత ఖైదీల నిరీక్షణ ఎట్టకేలకు ఫలించింది. ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 400మంది జీవితఖైదీలను విడుదల చేస్తూ సోమవారం అర్ధరాత్రి జీవో విడుదల చేసింది. ఇందులో భాగంగా నెల్లూరుజిల్లా కేంద్ర కారాగారం నుండి మంగళవారం సాయంత్రం 22మంది ఖైదీలు, కడపకు చెందిన 8 మంది మహిళా ఖైదీలకు జిల్లా జైలు నుండి విముక్తి కలిగింది. మనస్పర్ధలు, ఆస్తి తగాదాలు, రాజకీయ కక్షలు... ఇలా కారణాలేవైనా క్షణికావేశంలో కేసులలో చిక్కుకుని జీవితఖైదీలుగా మారి జైలు శిక్ష అనుభవించారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా సత్ప్రవర్తన కలిగిన జీవిత ఖైదీలను విడుదల చేయాలన్న ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు వీరిని విడుదల చేశారు. వీరిలో నెల్లూరు, ఒంగోలు, చిత్తూరు, కడప తదితర ప్రాంతాలకు చెందిన వారున్నారు. తెల్లవారుజాము నుంచే ఆయా ఖైదీల కుటుంబసభ్యులు, బంధువులు జైలువద్దకు చేరుకున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం క్షమాభిక్షపై విడుదలైన ప్రతి ఒక్క ఖైదీ రూ.50వేలకు వ్యక్తిగత బాండు సమర్పించాలి. మిగిలిన శిక్షాకాలం పూర్తయ్యేంత వరకు ప్రతి ఖైదీ ప్రతి 3నెలలకొకసారి సంబంధిత పోలీసు స్టేషన్‌లో హాజరు కావాలి. విడుదలైన ఖైదీలపై ఏదైనా కేసులో పోలీసుస్టేషన్లో కేసు నమోదైతే మరలా పాత కేసుకు సంబంధించి జైలు శిక్ష అనుభవించాల్సి వుంటుంది.

సింహపురి సమాచారం




### వియస్‌యూలో
# పర్యాటక సదస్సు



జాతీయ పర్యాటక దినోత్సవం సందర్భంగా సోమవారం నెల్లూరు విక్రమ సింహపురి యూనివర్శిటి కళాశాల సెమినార్ హాల్లో యూనివర్సిటీ టూరిజం మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో ఆర్ధికాభివృద్ధిలో పర్యాటక రంగం ఎదుర్కొంటున్న సవాళ్ళు, అవకాశాలు అనే అంశంపై జాతీయస్థాయి సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విఎస్‌యు వైస్‌ఛాన్సలర్ వి.వీరయ్య, ముఖ్యఉపన్యాసకులుగా శ్రీ వెంకటేశ్వర యూనివర్శిటీ మేనేజ్‌మెంట్ స్టడీస్ బిఓఎస్ ఛైర్మెన్ ఆచార్య డివి రమణ, వర్సిటి రిజిస్ట్రార్ ఆచార్య పి.ఆర్.శివశంకర్, కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి.వెంకటరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ నేడు పర్యాటక రంగం శరవేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రపంచ దేశాల్లో అనేక దేశాలు పర్యాటకమే ప్రధాన ఆదాయవనరుగా ఉన్నాయన్నారు.

ఈ కార్యక్రమంలో డాక్టర్ కె.వి.ఎస్.ఎన్ జవహర్‌బాబు, డాక్టర్ కె.నీల మణికంఠ, డాక్టర్ త్యాగరాజు, డాక్టర్ సుజాత, రాజు, విక్రమ్‌కుమార్, హిమని, పర్యాటక పరిశోధకులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## ధర్మకర్తలకు అభినందన సభ

నెల్లూరు గ్రామ దేవత శ్రీ ఇరుకళలమ్మ పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం నూతన పాలకమండలి సభ్యుల అభినందన సభ ఈనెల 31వ తేదీ ఉదయం 10.30గంటలకు అమ్మవారి దేవస్థానం ప్రాంగణంలో జరుగుతుంది. ధర్మకర్తల మండలి ఛైర్మెన్‌గా మెట్టు సురేష్‌బాబు, సభ్యులుగా అలిమేలి శ్రీహరి ఆచారి, పూల సుబ్రహ్మణ్యం, శ్రీమతి రావూరి కృష్ణసుధా, ఒట్టూరు సుధాకర్, ఉచ్చూరు సురేష్, పంత్రంగి వెంకటేశ్వర్లు, ఎక్స్ అఫిషియో సభ్యులుగా పులికొలను చంద్రశేఖర్‌లు ప్రమాణస్వీకారం చేయనున్నారు.

# వెండితెర వెలుగు 'రేఖ'కు అపూర్వ సత్కారం



**కళాబంధు టిఎస్ఆర్ సారథ్యంలో యశ్‌చోప్రా లైఫ్‌టైమ్ ఎఛీవ్‌మెంట్ అవార్డు ప్రదానం**

ప్రతి ఏడాదీ కళాకారులను, సినీతారలను సత్కరించి, వారికి నగదు బహుమతులతో పాటు లైఫ్‌టైమ్ ఎఛీవ్‌మెంట్ అవార్డులను కూడా ఇచ్చే ఉన్నతమైన సంప్రదాయం వున్న రాజ్యసభ సభ్యులు, కళాకారులకు ఆత్మబంధువు అయిన కళాబంధు టి. సుబ్బరామిరెడ్డి నేతృత్వంలో ఈ ఏడాది ప్రముఖ బాలీవుడ్ నటి శ్రీమతి రేఖకు ఎంతో ప్రతిష్టాత్మకమైన యశ్‌చోప్రా లైఫ్‌టైమ్ ఎఛీవ్‌మెంట్ అవార్డును ప్రదానం చేశారు. అవార్డు గ్రహీతకు ఈ అవార్డుతో పాటు స్వర్ణపతకం, పది లక్షల రూపాయల నగదు బహుమతిని కూడా అందజేసారు. ఆ మేరకు సుబ్బరామిరెడ్డి అవార్డు కమిటీవారి ఆధ్వర్యంలో శ్రీమతి రేఖకు ఘనమైన ఈ పురస్కారం లభించింది. ప్రముఖ దర్శక నిర్మాత యశ్‌చోప్రా జ్ఞాపకార్థం నెలకొల్పిన లైఫ్‌టైమ్ ఎఛీవ్‌మెంట్ అవార్డును కన్నులపండువగా ఏర్పాటు చేసిన వేదికపై ఎంతోమంది ప్రముఖుల కరతాళధ్వనుల మధ్య ప్రముఖ సినీనటి శ్రీమతి రేఖకు ప్రదానం చేశారు. ఈ నెల 25న ముంబైలో ఎంతో వేడుకగా జరిగిన ఈ కార్యక్రమంలో మహారాష్ట్ర గవర్నర్ సి.విద్యాసాగర్‌రావు చేతులమీదుగా ఆ అవార్డును అందజేశారు. సినీరంగ ప్రముఖులు, రాజకీయ ప్రముఖులతో కళకళలాడిన ఈ కార్యక్రమంలో కళాబంధు టి.సుబ్బరామిరెడ్డితో పాటు ప్రముఖ హీరో శత్రుఘ్నసిన్హా, ప్రముఖ సినీనటీమణులు శ్రీదేవి, జయప్రద, నటులు బోనీకపూర్, రణవీర్‌సింగ్, కేంద్ర మాజీ మంత్రి సుశీల్‌కుమార్ షిండే, ప్రముఖ సినీ నటుడు మోహన్‌బాబు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అవార్డుగ్రహీత శ్రీమతి రేఖ మాట్లాడుతూ, ఈ అవార్డును అందుకోవడం తనకెంతో ఆనందంగా వుందన్నారు. యశ్‌చోప్రా సార్‌తో తనకున్న అనుబంధం మర్చిపోలేనని, మనుషుల్ని ప్రేమించడం ఎలాగో ఆయననుంచే తెలుసుకున్నానని అన్నారు. ఇది తన జీవితంలో చివరి దశ కాదనీ..ఉత్తమ దశ అనీ అందరి హర్షధ్వానాల మధ్య అన్నారు. అనేకమంది సినీ ప్రముఖులు పాల్గొన్న ఈ కార్యక్రమాన్ని కళాబంధు టి.సుబ్బరామిరెడ్డి అందరినీ ఎంతో ఆత్మీయంగా ఆహ్వానించి, ఈ అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమాన్ని ఆద్యంతం అద్భుతంగా నిర్వహించి అందరి ప్రశంసలూ అందుకున్నారు.











## చంద్రబాబుతో చర్చించాకే...
# దేశంలోకి విపిఆర్!

నెల్లూరుజిల్లా రాజకీయాలలో వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి హాట్ టాపిక్ అయ్యారు. రాజకీయ చర్చలన్నీ కూడా ఆయన చుట్టూనే తిరుగుతున్నాయి. దీనికి కారణం గత కొన్ని రోజులుగా ఆయన వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీకి గుడ్‌బై చెప్పి తెలుగుదేశంలో చేరనున్నాడనే ఊహాగానాలు వస్తుండడమే! అయితే తెలుగుదేశంలో చేరికపై ఇంకా ఒక స్పష్టత రావడం లేదు. వైకాపా అధినేత వై.యస్.జగన్మోహన్‌రెడ్డి మీద మాత్రం ఆయన తీవ్ర అసంతృప్తితో వున్నాడు. 2014 ఎన్నికలప్పుడు గాని, ఆ తర్వాతగాని పార్టీ కోసం వేమిరెడ్డి ఎంతో చేశాడు. రాజ్యసభ ఇస్తాననే మాటిచ్చివున్నారు. అయితే ఇప్పుడు రాజ్యసభ సీటు కాదు కదా కనీస విలువ ఇవ్వడంలేదనే బాధ ఆయనలో వుంది. ఇలాంటి నాయకుడిని నమ్ముకుని రాజకీయాలలో ఉండడం కంటే ఊరకుండడం ఉత్తమం అనుకున్నాడు. వైకాపాను వీడాలనుకున్న వేమిరెడ్డి ఆలోచనలను పసిగట్టిన జిల్లా తెలుగుదేశం నాయకులు ఆయనను లడ్డులా పట్టుకున్నారు. సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డిలు ఆయనతో అత్యంత సన్నిహితంగా ఉంటారు. వేమిరెడ్డిని తెలుగుదేశంలో చేర్పించడానికి సోమిరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని చంద్రబాబుకు వేమిరెడ్డికి మధ్య అనుసంధానకర్తగా వ్యవహరిస్తున్నాడు. గల్లీ లీడర్లనే పార్టీలోకి తీసుకుంటున్న చంద్రబాబు వేమిరెడ్డిని వదులుకుంటాడా? ఆయనను వెంటనే పార్టీలో చేర్చుమని సోమిరెడ్డికి సూచించారు. ఫిబ్రవరి 2 లేదా 3 తేదీలలో చంద్రబాబుతో వేమిరెడ్డి భేటీ అయ్యే అవకాశాలున్నాయి. ఆ భేటీలో తన భవిష్యత్ మీద నమ్మకం కలిగితే వేమిరెడ్డి తెలుగుదేశంలో చేరడానికి ఆమోదం తెలిపే అవకాశాలున్నాయి. ఏదైనా ఒకట్రెండు రోజుల్లో తేలిపోనుంది.



ఇటీవల తెలుగుదేశం పార్టీ యువనాయకుడు నారా లోకేష్‌ను హైదరాబాద్‌లో కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న తెలుగుదేశంపార్టీ కర్నాటక కో-ఆర్డినేటర్ రావి మోహన్‌చౌదరి

# చిన్నారులకు వేమిరెడ్డి వితరణ

## • 500 మందికి స్కూల్ కిట్‌లు అందజేత

ప్రముఖ పారిశ్రామికవేత్త, వితరణ గుణశీలి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి ఎంతో కాలంగా జిల్లాలోని అనాథ పిల్లలకు, పేద విద్యార్థులకు, వికలాంగులకు ప్రతి ఏటా తనవంతు సహకారం అందజేస్తూనే వున్నారు. జిల్లాలోని అనేక పాఠశాలల్లో విద్యార్థుల భవిత కోసం ఆయన తన చేయూతనందిస్తూనే వున్నారు. ప్రముఖ దాతగా, మానవతావాదిగా, పేదలు-వికలాంగులైన చిన్నారుల్లో తిరిగి ఆత్మవిశ్వాసాన్ని కలిగించి, వారి జీవితాల్లో వెలుగులు ప్రసరించేందుకు ఎన్నో కార్యక్రమాల ద్వారా తన ఔదార్యాన్ని చాటుకుంటూనే వున్నారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా, ఈ నెల 22న నెల్లూరు రూరల్ మండలంలోని కనుపర్తిపాడు ప్రభుత్వ హైస్కూల్‌లో అయిదువందల మంది విద్యార్థినీ విద్యార్థులకు స్కూల్‌కిట్‌లు అందజేసి తన సేవాభావాన్ని మరింతగా చాటుకున్నారు. ఒక్కొక్కటి 3వేల రూపాయల విలువజేసే ఈ స్కూల్ కిట్‌లు విద్యార్థులకు ఎంతో ఉపయోగంగా వుంటాయని, విద్యార్థుల చదువులకు తాను ఎల్లవేళలా అండగా వుంటానని ఆయన ఈ సందర్భంగా అన్నారు. జిల్లాలో వెయ్యి స్కూళ్ళ విద్యార్థులకు ఇలాంటి కిట్‌లను అందజేయాలని భావిస్తున్నామని, ఇప్పటికి 10 మండలాలకు చెందిన 49 స్కూళ్ళ చిన్నారులకు ఈ కిట్‌లు అందజేశామని ఆయన అంటూ, చదువుకునే చిన్నారులను ప్రోత్సహించడమే తన లక్ష్యమని స్పష్టం చేశారు. చిన్నారుల భవిత కోసం మరిన్ని మంచి సేవాకార్యక్రమాలను చేపట్టేందుకు ఆలోచిస్తున్నామన్నారు. చిన్నారులందరూ క్రమశిక్షణతో చదువుకోవాలని, భావిభారత



పౌరులుగా ఎదగాలని, తమను కన్న తల్లి దండ్రులకు, గురువులకు, సమాజానికి, దేశానికి కీర్తిప్రతిష్టలు తీసుకురావాలని ఆయన ఈ సందర్భంగా ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వేమిరెడ్డితో పాటు పలువురు కెనడా దేశస్తులు కూడా పాల్గొనగా, వీరందరినీ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా స్వాగతించారు. కెనాడా దేశీయులైన డంకన్, మార్స్, వేనీ, పట్టి, డెన్నీస్‌ల చేతుల మీదుగా విద్యార్థులకు స్కూల్‌కిట్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేతంరెడ్డి వినోద్‌రెడ్డి, చెన్నైలోని అంబత్తూర్ రోటరీక్లబ్ ప్రతినిధి రామదాసు, 'లాయర్' వారపత్రిక సంపాదకులు తుంగా శివప్రభాత్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు



# 'ప్రభా'తం

దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలొడ్డి పోరాడిన మహాయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్. అలాంటి ఒక మహావ్యక్తి అప్పట్లో అదృశ్యమైన విషయం గురించిన వివరాలు నేటికీ పూర్తిస్థాయిలో వెల్లడికాకపోవడం విచారకరమే అయినప్పటికీ, ఆ మహనీయుని అదృశ్యం వెనుక దాగిన అనేక విషయాలకు సంబంధించిన దస్త్రాల(ఫైళ్ళు)ను ఇప్పటికైనా ప్రజల దృష్టికి తీసుకువచ్చే ప్రక్రియను నేటి కేంద్రప్రభుత్వం ప్రారంభించడం సంతోషకరం. ఆ ఘనత ముఖ్యంగా ప్రధాని మోడీకే దక్కుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు.

ఇన్నేళ్ళ తర్వాతనైనా పోరాటనేత నేతాజీ అదృశ్యానికి సంబంధించిన అనేక అంశాలు ప్రజల దృష్టికి రావడం స్వాగతించదగ్గ పరిణామమే. అంతటి కీలకమైన సమాచారాన్ని జాతికి అందించిన ఘనత ప్రధాని మోడీ సారధ్యంలోని కేంద్ర ప్రభుత్వానికే దక్కుతుందనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. స్వాతంత్ర్యోద్యమ కాలంలో నేతాజీ ఒక పోరాట స్ఫూర్తి. ఉక్కుసంకల్పంతో పోరాటరంగంలోకి దిగి అందరికీ స్ఫూర్తి దాయకంగా నిలిచిన మహాయోధులాయన. ఆజాద్ హింద్ ఫౌజ్, ఇండియన్ నేషనల్ ఆర్మీని స్థాపించి తద్వారా ఎంతోమంది యువకులను సైనికులుగా తీర్చిదిద్దిన వీరుడు.. ధీరుడాయన. బాపూజీ నాయకత్వం పట్ల విధేయునిగా వుంటూనే, ఆయన సిద్ధాంతాలతో విభేదించిన నేతాజీ.. బ్రిటిష్ సామ్రాజ్యవాదులు శాంతియుతమైన సత్యాగ్రహాలతో దిగిరారనీ, వారికి ఎదురొడ్డి పోరాడడమే ఏకైక మార్గమని గట్టిగా విశ్వసించారు. పోరాటమార్గాలు వేరైనప్పటికీ, అప్పట్లో స్వాతంత్ర్య పోరాటయోధులందరి లక్ష్యం మాత్రం మాతృభూమి దాస్య శృంఖలాలను ఛేదించడమే!.. దేశానికి స్వాతంత్ర్యాన్ని సముపార్జించి పెట్టడమే!.. నాటి తెల్లదొరలను గడగడలాడించిన నేతాజీ నాటికీ.. నేటికీ.. ఏనాటికైనా అందరికీ స్ఫూర్తి దాయకమే. నేతాజీకి, ఆయన పోరాటస్ఫూర్తికీ వందనం. అయితే, దాదాపు ఏడు దశాబ్దాలు గడిచినా ఆయన అదృశ్యం మాత్రం నేటికీ ఒక మిస్టరీగా మిగలడమే ఎంతో బాధాకరం. తైవాన్‌లోని తైపే వద్ద జరిగిన విమాన ప్రమాదంలో నేతాజీ మరణించారనే వాదనలు వినవచ్చినా, అందుకు అప్పట్లో స్పష్టమైన రుజువులు చూపేవారు లేక అందరిలోనూ రకరకాల అను మానాలు వెల్లువెత్తాయి. అంతేకాదు, అప్పట్లో ప్రభుత్వం నేతాజీ కుటుంబసభ్యులపై నిఘా వేయడం మరిన్ని అనుమానాలకు తావిచ్చినట్లయింది. ఆ తర్వాత, 1964 దాకా ఆయన సజీవంగానే వున్నట్లు వచ్చిన కథనాలు కలకలం రేకెత్తించాయి. అయితే, అలాంటి అనుమానాలన్నిటినీ అప్పటి ప్రభుత్వం తోసిపుచ్చింది. అయినా, నేటికీ నేతాజీ అదృశ్యం మిస్టరీ మాత్రం వీడనే లేదనే చెప్పవచ్చు.

ఈ నేపథ్యంలో, తాజాగా ప్రధాని నరేంద్రమోడీ సమక్షంలో విడుదల చేసిన దస్త్రాలద్వారా నేతాజీ అదృశ్యానికి సంబంధించి ఎన్నో కీలకమైన విషయాలు బహిర్గతం కావడం విశేషం. నేతాజీ 1945 ఆగస్టు 18న తైపేలో జరిగిన విమాన దుర్ఘటనలో మరణించారని భారత ప్రభుత్వం 1995లో ప్రకటించినట్లు, నేతాజీ అంతుచిక్కని అదృశ్యంపై యాభైఏళ్ళ తర్వాత ప్రభుత్వం వివరణ ఇచ్చినట్లు ఆ దస్త్రాల ద్వారా తెలుస్తోంది. అంతేకాదు, విమానప్రమాదం జరిగిన అయిదురోజుల తర్వాత నేతాజీని యుద్ధనేరస్తునిగా పేర్కొనే విషయంలో లాభనష్టాలను అప్పటి బ్రిటిష్ ప్రభుత్వానికి చెందిన ఓ ఉన్నతాధికారి విశ్లేషించినట్లు.. ఇలాంటి విషయాలన్నీ తాజాగా బహిరంగపరచిన ఈ రహస్యపత్రాల ద్వారా వెలుగులోకి రావడం విశేషం. గత ఏడాది అక్టోబర్‌లో నేతాజీ కుటుంబసభ్యులను ప్రధాని మోదీ కలుసుకున్నప్పుడు, 70 ఏళ్ళ క్రితం అంతుపట్టని రీతిలో అదృశ్యమైన స్వాతంత్ర్య సమరయోధునికి సంబంధించిన ఫైళ్ళను బహిర్గతం చేస్తామని ప్రకటించి, ఇప్పుడు ప్రధాని మోడీ ఆ మాటను నిలబెట్టుకున్నారు.

నేతాజీ 119వ జయంతి సందర్భంగా ప్రధాని మోడీ, నేతాజీ బంధువుల సమక్షంలో 16,600 పుటలతో వున్న నూరు రహస్య దస్త్రాలను బహిరంగపరచడంతో ఇన్నాళ్లు నేతాజీ అదృశ్యం వెనుక వున్న అనేకానేక విషయాలకు సంబంధించిన అనుమానాలు తీరిపోయేందుకు అనువైన దారి దొరికినట్లయింది. తాజాగా బయటపెట్టిన పత్రాల్లో 1995 ఫిబ్రవరి 6న అప్పటి కేంద్ర హోంశాఖ కార్యదర్శి పద్మనాభయ్య సంతకం చేసిన పత్రంలో, "నేతాజీ 1945 ఆగస్టు 18న తైహొకులో విమానప్రమాదంలో మరణించడంపై అనుమానించే పరిస్థితి కనిపించడం లేదని.. దీనిని భారత ప్రభుత్వం ఇప్పటికే అంగీకరించిందని" స్పష్టం చేశారు. ఇలాంటి విషయాలెన్నో ఈ దస్త్రాల్లో బహిర్గతం కావడం దేశవ్యాప్తంగా ప్రజలందరి దృష్టినీ ఆకర్షిస్తోంది. కాగా, ఇటీవల తాజాగా బ్రిటన్ వెబ్ సైట్‌లో.. అప్పట్లో నేతాజీ అనుచరునిగా వున్న రెహమాన్‌ని ఉటంకిస్తూ వచ్చిన కథనం ప్రకారం, నేతాజీ ప్రయాణం చేసిన విమానం ఇంజన్ పడిపోవడంవల్ల మంటల్లో చిక్కుకోవడంతో నేతాజీ తీవ్రంగా గాయపడ్డారని, చికిత్స అందించేలోగానే ఆయన మృతిచెందారని పేర్కొంది. అప్పుడు ఆయన తన అనుచరుడైన రెహమాన్‌తో, దేశం కోసం కొనవూపిరి వరకూ పోరాడానని తెలియజేయి..భారత్‌ని ఎంతోకాలం బ్రిటిష్‌వారు బందీగా వుంచలేరు..స్వాతంత్ర్యం వచ్చి తీరుతుంది"..అని నేతాజీ అన్నట్లు ఆ వెబ్‌సైట్ పేర్కొంది. అయినప్పటికీ.. నేతాజీ అదృశ్యం వెనుక మిస్టరీ పూర్తిగా వీడిపోయిందా అంటే..అలా అనుకునేవారు తక్కువేననుకోవచ్చు. మరోవైపు, జపాన్‌లోని రెంకోజీ ఆలయంలో వుంచిన చితాభస్మం నేతాజీదో కాదో నిర్ధారణకు డిఎన్ఏ పరీక్ష నిర్వహించాలని నేతాజీ కుమార్తె డాక్టర్ అనితా బోస్ కోరుతున్నారు. అందుకు ఇప్పటి ప్రభుత్వం స్పందించి జపాన్‌తో సంప్రదింపులు జరిపితే మరిన్ని విషయాలు వెలుగుచూసే అవకాశం వుందని భావిస్తున్నారు. ఏదేమైనా, నేతాజీ మరణ సమాచారం తెలిసినప్పుడే అప్పటి ప్రభుత్వం అన్నికోణాల్లో సమగ్ర దర్యాప్తు జరిపి నిజానిజాలను అప్పుడే స్పష్టంగా లోకానికి వెల్లడిచేసివుంటే బహుశా ఇన్ని అనుమానాలకు తావుండేది కాదేమో!..అయినా.. నిజం నిప్పులాంటిది. ఎవరేమనుకున్నా..ఏదేమైపోయినా.. ఎప్పటికైనా సరే..అది తానేమిటో తనే ప్రత్యక్షమై తనంటే ఏమిటో తనే రుజువు చేసుకుంటుంది. నిజానికి వున్న గొప్ప నైజం అదే!..ఆ రోజు త్వరలోనే వస్తుందని ఆశిద్దాం!...

## నేతాజీకి..వందనం!



స్వాతంత్ర్య పోరాటయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ అదృశ్యం ఇప్పటికీ ఒక మిస్టరీగానే మిగలడం విచారకరం. అయితే, అందుకు సంబంధించిన కీలకమైన విషయాలను వెల్లడించే నూరు రహస్య దస్త్రాలను ఇటీవల ప్రజలకు బహిరంగపరచిన ఘనత ప్రధాని నరేంద్రమోడీకే దక్కుతుంది. దీంతో, నేతాజీ అదృశ్యం వెనుక దాగిన మిస్టరీ పూర్తిగా వీడిపోయిందని అప్పుడే అనుకోలేం కానీ, ఆ మేరకు ప్రజల్లో వున్న అనుమానాలు అనేకం తీరిపోయేందుకు అనువైన దారి దొరికినట్లేనని భావించవచ్చు.

## నేత్రపర్వంగా మహా పుష్పయాగం



నెల్లూరులోని సంతపేటలో ఆదివారం రాత్రి శ్రీ సాయినాధునికి భక్తులు మహా పుష్పయాగం నిర్వహించారు. షిర్డీసాయి భక్తబృందం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నాలుగుకాళ్ళ మండపం కూడలి వద్ద శ్రీసాయినాధుని నిలువెత్తు విగ్రహాన్ని ఏర్పాటు చేసి షిరిడీ సంప్రదాయ పద్ధతిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. 1116 మంది మహిళా భక్తులతో ఏకకాలంలో స్వామివారికి విశేషమైన రీతిలో ధూపహారతినిచ్చారు. వివిధ రాష్ట్రాల నుంచి 1116 కిలోల పుష్పాలను తెప్పించి సాయినాధునికి మహా పుష్పయాగం నిర్వహించారు. రంగనాయకులపేటలోని శ్రీ రంగనాధస్వామి ఆలయం నుంచి సాయినామ స్మరణ చేస్తూ నాలుగుకాళ్ళ మండపం వద్దకు వచ్చి, అక్కడ స్వామివారికి వేడుకగా పల్లకీసేవ నిర్వహించారు. ఆద్యంతం ఎంతో భక్తిశ్రద్ధలతో జరిగిన ఈ కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ యాదవ్, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, డిప్యూటి మేయర్ ముక్కాల ద్వారకానాథ్, సరాబు సుబ్రహ్మణ్యం, బిజెపి జిల్లా అధ్యక్షుడు సురేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీరాజ్ ఎస్ఇగా మాణిక్యాలరావు

జిల్లా పంచాయతీరాజ్ సూపరింటెండింగ్ ఇంజనీర్‌గా మాణిక్యాలరావును ప్రభుత్వం నియమించింది. హైదరాబాద్‌లోని రాజీవ్ విద్యామిషన్ ఇఇగా ఆయన పనిచేస్తున్నారు. పదోన్నతిపై నెల్లూరుకు బదిలీ అయ్యారు. కొత్తగా బదిలీ అయి నెల్లూరుకు వచ్చిన మాణిక్యాలరావుకు 'లాయర్' శుభాకాంక్షలు.

## ఉచిత వైద్యశిబిరం

నెల్లూరులోని జెండా వీధిలో వున్న పిఎస్ఎం మునిసిపల్ ఉన్నత పాఠశాలలో ఆదివారం స్థానిక కార్పొరేటర్ ఖలీల్ సహకారంతో విజయా కేర్ సెంటర్‌వారు ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరానికి విచ్చేసిన మహిళలకు వైద్యులు ఆరోగ్యపరీక్షలు నిర్వహించి, వైద్యసేవలు అందించారు. ఈ శిబిరంలో డాక్టర్ అన్నపూర్ణ, పిఆర్ఓ షరీఫ్, ఆరిఫ్, నూరుల్లా, జమీర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా వున్న కాలనీల్లో అల్లకల్లోలం

నెల్లూరు సిటీలోని చిల్డ్రన్స్ పార్కు వద్ద వున్న ఆదిత్యనగర్, రామ్‌జీనగర్ కాలనీలు ఆదర్శవంత కాలనీలుగా పేరు పొందాయి. ఎన్ఐఆర్ కాలనీలుగా శుభ్రంగా రహదారులు, పచ్చటి మొక్కలుండేవి. ఈ కాలనీలో జాతీయ రహదారితో కలిపిన తరువాత పార్కు రోడ్డు, మార్కెట్ రోడ్డు అయింది. పార్కు వలన మార్కెట్టు రోడ్డు వలన అసాంఘిక శక్తులు పెరిగాయి. రౌడీయిజం, ఈవ్‌టీజింగ్, కిడ్నాప్‌లు, దొంగతనాలు పెరిగాయి. దేవాలయాలకు భక్తులు రావాలంటే భయంగా వుంది. నేడు పై దుర్మార్గాలతో పాటు కాల్‌మనీ ప్రబుద్ధులు వారి ఖాతాదారులను చెరబడుతున్నారు. సంసారాల మధ్య ఇళ్లలో ఒక పెద్దమనిషి ఇంటి ప్రక్కన వ్యభిచార గృహం నడుస్తోంది. గల్ఫ్‌కు యువతులను చేరవేసే గ్యాంగ్ వున్నట్లు తెలుస్తోంది. ఐసియస్ సానుభూతులు వున్నట్లు గుసగుస లాడుతున్నారు. ఉపద్రవం రాకముందే పరిశీలనగావింప జేసి అసాంఘిక శక్తులను అణచివేయవలసిందిగా ప్రార్థిస్తున్నాము.


**పేర్లు ప్రకటించే ధైర్యము లేని అభాగ్యులు**

## మా సమస్యలను పట్టించుకోండి

జిల్లాలో పెరిక బలిజ కులానికి సంబంధించిన విద్యార్థులకు బి.సి. క్రింద ధృవీకరణ పత్రాలను ఇవ్వాలని గతంలో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్ ఇంతియాజ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. తహశీల్దార్‌కు ఈ విషయమై సమాచారం ఇవ్వాలని, ఏ మాత్రం ఆలస్యం చేయొద్దని కూడా కోరారు. కలెక్టర్ గారితోనూ ఈ విషయంపై ఎమ్మెల్యే మాట్లాడారు. ఎక్కడా కదలిక లేదు. శ్రీధరన్నకు నా విన్నపం ఒక్కటే! జిల్లా మంత్రి పి.నారాయణతోనూ, జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి శిద్దా రాఘవరావుతోనూ చర్చించండి. కేంద్రమంత్రి, నెల్లూరు వాసి వెంకయ్యనాయుడు దృష్టికి కూడా మా సమస్యను తీసుకెళ్లండి. పార్లమెంటులో చర్చించాలని సూచిస్తూ నెల్లూరు, తిరుపతి ఎంపీలకు లేఖలు వ్రాయండి. ఈ సమస్యను పరిష్కరిస్తే కోటంరెడ్డి శ్రీధరన్నకు ఎప్పుడూ ఋణపడి వుంటాము.

**పాపిశెట్టి లలిత, నెల్లూరు రూరల్.**

## నిజాలను నిగ్గు తేల్చండి




హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో విద్యార్థి రోహిత్ ఆత్మహత్యను పెద్ద వివాదాస్పదం చేసి పెట్టారు. దేశంలోని పలు విద్యాసంస్థల్లో ఎందరో విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా పట్టించుకోని రాజకీయ పుంగవులు దీనిపై దుమారం రేపారు. యూనివర్శిటీలో ఏం జరిగిందో బయట పెట్టండి. యాకుబ్ భారత స్వాతంత్ర్య సమరయోధుడు కాదు, మన జాతీయ నాయకుడు కాదు. వందలమందిని పొట్టన పెట్టుకున్న కిరాతకుడు. అలాంటి వారి పట్ల సానుభూతి చూపిస్తూ ఒక యాకుబ్ చచ్చిపోతే వెయ్యి మంది యాకుబ్‌లు పుడతారంటూ ప్రకటనలు చేయడాన్ని ఏమనుకోవాలి. భారతీయులు కట్టే పన్నులతో వసతులు పొందుతూ, రిజర్వేషన్లు అనుభవిస్తూ, అదే భారతావనికి ముప్పు తెచ్చే ఉగ్రవాదులకు మద్దతుగా నిలుస్తున్న వాళ్లను ఉపేక్షించ కూడదు. రోహిత్ వ్యక్తిగత కారణాలతో ఆత్మహత్య చేసుకుంటే దానిని రాజకీయం చేయడం తగదు.

**సి. రాజీవి, నెల్లూరు.**

## విజ్ఞతతో వుంటే జగన్‌కు భవిష్యత్

విజ్ఞతతో వ్యవహరిస్తే 2019లో జగన్ ముఖ్యమంత్రి కావడం ఖాయం. కాంగ్రెస్ నాయకులను తెలుగుదేశంలోకి తీసుకుంటూ తన పార్టీ వారిలోనే వ్యతిరేకత తెచ్చుకుంటున్నాడు చంద్రబాబు. చంద్రబాబు పథకాలు, అవినీతి పోకడలు ప్రజలకు సమ్మతం కాదు. ఈసారి ఎన్నికల్లో ఉద్యోగులు, దళితులు, ముస్లింలు వైకాపాకు అండగా నిలుస్తారు. చంద్రబాబు వైఫల్యాలు జగన్‌కు వరంగా మారనున్నాయి.

**వాస్తు రామచంద్ర, నెల్లూరు.**

# ఘనంగా గణతంత్రం

జనవరి 26వ తేదీన నెల్లూరుజిల్లాలో 67వ గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. వాడవాడలా మువ్వన్నెల జెండాలు రెపరెపలాడాయి. నెల్లూరు పోలీసుపరేడ్ గ్రౌండ్‌లో శోభాయమానంగా నిర్వహించిన రిపబ్లిక్‌డే వేడుకలలో జిల్లా కలెక్టర్ యం.జానకి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి జెండా వందనం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుతూ, జిల్లా ప్రగతిపై వివరణాత్మక సందేశమిచ్చారు. జిల్లా అభివృద్ధి పథంలో పయనిస్తున్న తీరును ఆమె ఉదహరించారు. పోలీసు కవాతు ఎంతగానో ఆకట్టుకుంది. ప్రభుత్వశాఖల శకటాల ప్రదర్శన ఆకర్షణీయంగా సాగింది. ఇక జిల్లాలోని వివిధ పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన దేశభక్తి గేయాల నృత్య ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం వివిధ శాఖల నుండి ఉత్తమ సేవలందించిన ఉద్యోగులకు, వివిధ రంగాలలో ప్రతిభావంతులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ వేడుకలలో జిల్లా జడ్జి సి. హెచ్. కనకదుర్గారావు, ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కిలివేటి సంజీవయ్య, ఎస్పీ గజరావు భూపాల్, జాయింట్ కలెక్టర్ ఇంతియాజ్‌అహ్మద్, జేసీ-2 రాజ్‌కుమార్, డిఆర్‌ఓ సుదర్శనరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇక నెల్లూరులోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలలో, ప్రభుత్వ కార్యాలయాల్లో, వివిధ రాజకీయ పార్టీల కార్యాలయాల్లో జాతీయ పతాకాన్ని ఎగురవేసి గణతంత్ర వేడుకలను దేశభక్తితో నిర్వహించారు.









జడ్జీ కార్యాలయంలో...



వేదవ్యాస స్కూల్లో...

## శ్రీసిటీలో స్వచ్ఛభారత్ రన్

- ప్రారంభించిన మాజీ క్రికెటర్ రాబిన్‌సింగ్



ప్రతిష్టాత్మక పారిశ్రామికవాడ శ్రీసిటీలో 26వ తేదీ గణతంత్ర దినోత్సవం సందర్భంగా స్వచ్ఛభారత్ 10కె, 5కె రన్‌లను నిర్వహించారు. ట్రిపుల్‌ఐటి, ఐఎఫ్‌ఎంఆర్, శ్రీసిటీ ఫౌండేషన్ వారు కలిసి నిర్వహించిన ఈ కార్యక్రమంలో భారత మాజీక్రికెటర్ రాబిన్‌సింగ్ పాల్గొని 10కె రన్‌ను ప్రారంభించారు. శ్రీసిటీ సెజ్ డి.సి. ఎ.కె.చౌదరి 5కె రన్‌ను ప్రారంభించారు. శ్రీసిటీ ఛైర్మెన్ శ్రీనిరాజు, యం.డి రవీంద్ర సన్నారెడ్డి, చెన్నై ఐఐటి ప్రొఫెసర్ అశోక్‌జంజున్‌వాలా, ఐఎఫ్‌ఎంఆర్ డైరెక్టర్ వినయ్ మిట్టల్‌లు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని 10కె, 5కె రన్ విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. అనంతరం ఇక్కడే ట్రిపుల్ ఐటి నూతన భవన నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. ఈ స్వచ్ఛభారత్ రన్ కార్యక్రమంలో విద్యార్థులు, ఉద్యోగులు, విదేశీ ప్రతినిధులంతా కలిసి వెయ్యి మందికిపైగా పాల్గొనడం విశేషం.

### నెల్లూరు పోలీసులకు
## భారత పోలీసు పతకం



రమేషయ్య



షఫీ అహ్మద్

ఉత్తమ విధి నిర్వహణకుగాను నెల్లూరు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ రమేషయ్యకు, స్పెషల్ బ్రాంచ్ ఎస్‌ఐ షఫీ అహ్మద్‌లకు రాష్ట్ర ప్రభుత్వం ఇండియన్ పోలీస్ మెడల్స్‌ను ప్రకటించింది. చిత్తూరు జిల్లా శ్రీకాళహస్తికి చెందిన రమేషయ్య 2015ఫిబ్రవరిలో నెల్లూరుజిల్లా విజిలెన్స్ ఎస్పీగా వచ్చారు. అక్రమరవాణాపై, అక్రమ నిల్వలపై ఆయన ఉక్కుపాదం మోపి, అక్రమార్కులపై కేసులు నమోదు చేయడం ద్వారా 162కోట్ల సొమ్మును ప్రభుత్వానికి రాబట్టారు. గతంలోనూ ఆయన పలు అవార్డులు పొంది ఉండడం విశేషం.

నెల్లూరుకు చెందిన షఫిఅహ్మద్ 1983లో కానిస్టేబుల్‌గా పోలీసు శాఖలో చేరారు. 1991లో హెడ్‌కానిస్టేబుల్‌గా 2002లో ఏఎస్‌ఐగా, 2010లో ఎస్‌ఐగా పదోన్నతులు సాధించారు. జిల్లాలో కావలి రూరల్, కావలిటౌన్, వెంకటగిరి, డిసిఆర్‌బి, బాలాజీనగర్, నెల్లూరు టూటౌన్‌లలో ఎస్‌ఐగా పని చేశారు. ప్రస్తుతం స్పెషల్ బ్రాంచ్‌లో పనిచేస్తున్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడుకుంటూ క్లిష్టమైన కేసులను ఛేధించడంలో ఆయనకు ప్రత్యేకగుర్తింపు వుంది. ప్రతిష్టాత్మక పోలీస్ మెడల్‌కు ఎంపికైన ఇద్దరికీ 'లాయర్' అభినందనలు.

### జెఏలకు
## పదోన్నతులు కల్పించాలి



నెల్లూరుజిల్లా ప్రజా పరిషత్ పరిధిలో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్లకు సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించాలని జడ్పీ సిఇఓ బి.రామిరెడ్డికి ఏపి పంచాయితి రాజ్ మినిస్టీరియల్ జూనియర్ అసిస్టెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు లక్కాకుల పెంచలయ్య వినతిపత్రాన్ని సమర్పించారు. యాజమాన్య పరిధిలో ఏడు సీనియర్ అసిస్టెంట్ల ఖాళీలు వుంటే 19సంవత్సరాలు పూర్తి చేసుకున్న జూనియర్ అసిస్టెంట్లకు అవకాశం ఇవ్వాలని కోరారు.

# ప్రతిభామూర్తి.. ఇంజనీరింగ్‌లో అసామాన్య కీర్తి

- అల్లూరు నుంచి అంతర్జాతీయ స్థాయికి ఎదిగిన పర్వతరెడ్డి రవీంద్రరెడ్డి కన్నుమూత

కృషి వుంటే..మనుషులు రుషులవుతారు.. మహాపురుషులవుతారు.. అన్నట్లుగా, నిర్విరామ కృషి..ప్రతిభ..పట్టుదలే ఆయనకు ఎనలేని ఖ్యాతిని తెచ్చాయి. సాంకేతికరంగంలో ఆయనకున్న అంతులేని జిజ్ఞాసే ఆయనకు ఎనలేని కీర్తిప్రతిష్టలను తెచ్చిపెట్టింది. సాంకేతిక రంగంలో అట్టడుగు స్థాయి నుంచి స్వయంకృషితో అంతర్జాతీయ స్థాయికి ఎదిగారు. ఎమ్‌టార్ టెక్నాలజీస్ వ్యవస్థాపకునిగా, ఛైర్మెన్‌గా ఆయన ఇంజనీరింగ్ రంగంలో ఎంతో సుప్రసిద్ధులయ్యారు. తన అద్భుతమైన ప్రతిభతో ప్రపంచస్థాయిలో ఇంజనీరింగ్ రంగంలో తెలుగువారి ఖ్యాతిని ఇనుమడింపజేయడమే కాక, తన సొంతజిల్లా అయిన నెల్లూరు సీమకే ఎనలేని కీర్తిప్రతిష్టలను తెచ్చారు. ఆయన ఎవరో కాదు..మన పర్వతరెడ్డి రవీంద్రరెడ్డి. ఆయన నెల్లూరుజిల్లా వాసి కావడం ఈ జిల్లాకే గర్వకారణం.



పర్వతరెడ్డి రవీంద్రరెడ్డి సొంత వూరు నెల్లూరు జిల్లాలోని అల్లూరు. ప్రాథమిక విద్యాభ్యాసమంతా అల్లూరులోనే. మద్రాసులోని లయోలా కాలేజీలో ఇంటర్ చదివారు. అదయ్యాక అనంతపురంలో బిటెక్‌లో చేరారు. ఆ తర్వాత, 1959లో మెకానికల్ ఇంజనీరింగ్‌లో బిటెక్ పూర్తి చేశారు. అనంతరం, హైదరాబాద్‌లోని బాలానగర్ ఇండస్ట్రియల్ ఏరియాలో ఒక చిన్న మెషిన్‌షాప్‌తో జీవనయాత్ర ప్రారంభించిన పర్వతరెడ్డి.. తన అసామాన్యమైన ప్రతిభాపాటవాలతో రాణించి, ఇంజనీరింగ్ నైపుణ్యంతో ఆ రంగంలో అత్యున్నతస్థాయికి ఎదిగి అందరికీ మార్గదర్శకమయ్యారు. సాంకేతిక రంగంలో అద్భుతాలు సృష్టిస్తూ, ఎమ్‌టార్ టెక్నాలజీస్ అనే సంస్థను స్థాపించి, దానికి ఛైర్మెన్‌గా వుంటూ ఆ సంస్థను ప్రతిష్టాత్మకంగా అంతర్జాతీయస్థాయిలో తీర్చిదిద్దారు. ఈ సంస్థ తయారుచేసిన రాకెట్ ఇంజన్లను అత్యంత ప్రతిష్టాత్మకమైన 'మంగళయాన్' ప్రాజెక్టులో సైతం వినియోగించిందంటే ఎమెటార్ టెక్నాలజీస్ సంస్థలోని ఇంజనీరింగ్ నైపుణ్యానికి ఇంతకంటే నిదర్శనం అక్కరలేదు. అంతేకాదు, ఎంతో క్లిష్టసాధ్యమైన న్యూక్లియర్ రియాక్టర్‌లను సైతం పూర్తిస్థాయిలో నిర్వహించగల సత్తా, సామర్థ్యం ఈ సంస్థ సాధించుకున్నదంటే అతిశయోక్తేమీ కాదు. అంతటి ప్రతిభా ప్రావీణ్యంతో ఎమ్‌టార్ టెక్నాలజీస్‌ను ప్రపంచస్థాయిలో గుర్తింపు వచ్చేలా చేసిన ఘనత రవీంద్రరెడ్డిది. సాంకేతిక నైపుణ్యానికి గీటురాయి అనదగ్గ స్థాయిలో రాణించే ఈ సంస్థ తయారుచేసే ఎన్నో రకాల ముఖ్యమైన విడిభాగాలను న్యూక్లియర్ పవర్ రియాక్టర్‌లలో వినియోగిస్తున్నారు కూడా. దేశానికెంతో అవసరమైన, ఎంతో కీలకమైన రక్షణ రంగం, వైమానిక రంగం, పెట్రోలియం-ఇంధన రంగాలకు చెందిన పరిశ్రమల్లోనూ ఎమ్‌టార్ టెక్నాలజీస్ పాత్ర ఎంతో ప్రముఖమైనది. ఏళ్ళ తరబడి అకుంఠిత దీక్షాదక్షతలతో, నిరంతర కృషితో, అన్నిటికీ మించి అత్యంత నైపుణ్యం కలిగిన పరిజ్ఞానంతో ఎమ్‌టార్ టెక్నాలజీస్ సంస్థ ప్రతిభా పతాకను అంతర్జాతీయస్థాయిలో రెపరెపలాడించిన ప్రతిభాశాలి పర్వతరెడ్డి. అయినా, ఎంత ఎదిగినా ఒదిగి వుంటే మంచితనం, ఎంత నేర్చినా ఇంకా నేర్చుకోవాలనే ఉత్సాహం ఆయనను సమున్నతమైన కీర్తిశిఖరాలను అధిరోహించేలా చేశాయి. ఆయన ప్రతిభకు గుర్తింపుగా జాతీయ అంతర్జాతీయ స్థాయిలో ఎంతో ప్రతిష్టాత్మకమైన అవార్డులను కూడా ఆయన అందుకున్నారు. 2003లో ఐఎన్‌ఎస్ (ఇంటర్నేషనల్ ఆటమిక్ ఎనర్జీ ఏజెన్సీ) ఇండస్ట్రియల్ ఎక్స్‌లెన్స్ అవార్డును, అదేవిధంగా 2004లో నాటి ప్రధాని చేతుల మీదుగా డిఫెన్స్ టెక్నాలజీ అబ్సార్ప్షన్ అవార్డును, విఖ్యాత శాస్త్రవేత్త నాయుడమ్మ అవార్డును కూడా అందుకున్నారు. అంతేకాదు, నేషనల్ అకాడమీ ఆఫ్ ఇంజనీర్స్ సంస్థకు సభ్యునిగా ఆయన విశేషమైన సేవలు చేశారు. ఇస్రోకు చెందిన ఆంత్రిక్స్ కార్పొరేషన్ బోర్డుకు కూడా ఆయన డైరెక్టర్‌గా సేవలందించి తన ప్రతిభను చాటుకున్నారు. జీవితమార్గంలో ఎన్ని కష్టాలొచ్చినా వెరవక, అనుకున్న దారిలోనే అనుకోని విజయాలెన్నో సాధించిన కీర్తిమూర్తి ఆయన. తానొక్క వ్యక్తే అయినా..శాస్త్ర సాంకేతిక రంగాలకు వెలుగుబాటలు పరిచే వేలాదిమందికి జీవనోపాధి కల్పించే శక్తిని సాధించుకుని అనితరసాధ్యమైన రీతిలో సంస్థను జయప్రదంగా నడిపించిన సాంకేతిక రథ సారధి ఆయన. అల్లూరు నుంచి అంతర్జాతీయస్థాయికి ఎదిగి.. అటు పుట్టిన వూరికీ, ఇటు నెల్లూరుసీమకే కాక, తెలుగుజాతికంతటికీ విశేష ఖ్యాతిని తెచ్చిన పర్వతరెడ్డి..చిన్ననాటి నుంచి శ్రమైక జీవనమే బాటగా భావించి, అహోరాత్రులూ పరిశ్రమించి..ఎందరికో ఉపాధినిచ్చి వారి జీవితాల్లో వెలుగులు ప్రసాదించిన రవీంద్రరెడ్డి...ఇక లేరనుకోవడం ఎంతో బాధాకరం. అంతటి ఖ్యాతినంతటినీ భావితరాలకు స్ఫూర్తిదాయకం చేసి, తన 77వ ఏట ఈ నెల 21వ తేదీ ఆయన అనంతలోకాలకు తరలిపోయారు. ఆయనకు భార్య, ఒక కుమారుడు, ముగ్గురు కుమార్తెలు వున్నారు. ఆయన మృతితో ఆయన కుటుంబసభ్యులతో పాటు, శాస్త్ర సాంకేతిక రంగాల్లోని ఆయన సహచరులు, ఆత్మీయులు, అభిమానులందరూ చలించిపోయారు. కన్నీటితో ఆయనకు నివాళులర్పించారు. అద్వితీయమైన ప్రతిభతో ప్రకాశించి సింహపురి కీర్తిని ఇనుమడింపజేసిన ఆ కీర్తిమూర్తి స్మృతికి 'లాయర్' నివాళి. ఆయన మృతికి సంతాపం తెలియజేస్తూ..ఆయన కుటుంబ సభ్యులకు మా ప్రగాఢ సానుభూతి.

# నెల్లూరు కబుర్లు

## కలెక్టర్ జానకి బదిలీ కానుందా?



జిల్లా కలెక్టర్ శ్రీమతి యం.జానకి బదిలీపై కొంతకాలంగా చర్చ జరుగుతోంది. బదిలీకి ఆమే ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. జానకి భర్త యువరాజ్ విశాఖ కలెక్టర్‌గా పనిచేస్తున్నారు. అక్కడికి దగ్గరలోనే విజయనగరం లేదా శ్రీకాకుళం జిల్లాలకు వెళ్లాలని జానకి కోరుతున్నట్లు తెలుస్తోంది. జిల్లాలో మంత్రి పి.నారాయణతో ఆమెకు పడడం లేదు. మంత్రి అర్ధరాత్రులు అధికార యంత్రాంగాన్ని సతాయించడం ఆమెకు నచ్చడం లేదు. మంత్రి అర్ధరాత్రిళ్లు, అప రాత్రిళ్లు సమీక్షలు పెడుతుంటాడు, అతనికి మాత్ర వేసుకుంటేగాని నిద్ర రాదు. తనకి నిద్ర రావడం లేదని చెప్పి అధికారులందరికీ నిద్ర లేకుండా చేస్తున్నాడు. పొద్దస్తమానం పని చేసొచ్చి రాత్రి ఇంట్లో పడుకుని కునుకుపట్టే వేళల్లో మంత్రి గారి పిఎ నుండి అధికారులకు ఫోన్‌లు వస్తుంటాయి. ఒక్కోసారి ప్రత్యక్షంగా సమీక్షలు... లేదంటే ఫోన్‌ల లోనే సమీక్షలు... వీటివల్ల ఉపయోగం కూడా లేదు. కొందరు అధికారులైతే మంత్రి దెబ్బకు భయపడి రాత్రిళ్లు తమ ఫోన్‌లు స్విచ్చాఫ్ చేసి పడుకుంటున్నారు. మంత్రితో పడక పోవడం వల్లే జానకి బదిలీని కోరుతున్నట్లు తెలుస్తోంది.

## తెలుగు జర్నలిజంలో ఆయన విరిసిన పద్మమే!

### - రామోజీకి సోమిరెడ్డి ప్రశంసలు



ఈనాడు, ఈ టీవీల అధినేత, మీడియా మొఘల్ రామోజీ రావుకు పద్మవిభూషణ్ బిరుదు రావడం పట్ల తెలుగుదేశం పార్టీ కేంద్ర పొలిట్‌బ్యూరో సభ్యులు, శాసనమండలి సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. రామోజీరావుది చిన్నప్పటి నుండి కష్టపడే తత్వం. ఈనాడు, ఈ టీవీలలో 'అన్నదాత డైరీ' ద్వారా రైతాంగానికి సేవలందిస్తున్నారు. రామోజీ ఫిలింసిటీని దేశానికే తలమానికంగా తీర్చిదిద్దారు. అన్ని భాషలలోనూ టీవీ ఛానెల్స్ పెట్టి ప్రజలకు సమగ్ర సమాచారాన్ని అందిస్తున్నారు. ఈ అవార్డుకు ఆయన అన్ని విధాలా అర్హుడని సోమిరెడ్డి పేర్కొన్నారు.

## బీజేపీ నాయకుల్లో 'అమిత్'ఆనందం



బిజెపి జాతీయ అధ్యక్షుడిగా అమిత్‌షా రెండవసారి ఎంపిక కావడంతో ఆదివారం నెల్లూరులోని ఆ పార్టీ నాయకులు ఆనందోత్సాహాల మధ్య సంబరాలు జరుపుకున్నారు. మినీబైపాస్‌రోడ్డులోని బిజెపి కార్యాలయం వద్ద బాణాసంచా వేడుకలు నిర్వహించి, అందరికీ మిఠాయిలు పంచారు. బిజెపి నాయకులు సురేష్‌రెడ్డి, ఆంజనేయరెడ్డి, సురేంద్రరెడ్డి, మొగరాల సురేష్, మండ్ల ఈశ్వరయ్య, పరశురాం, కాయల మధు, ఉదయకుమార్, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అపోలోలో న్యూరో సిఎంఇ కోర్సు



నెల్లూరు అపోలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో న్యూరో సైన్సెస్ డిపార్ట్ మెంట్‌లో ప్రొఫెసర్ డాక్టర్ బిందుమీనన్ ఆధ్వర్యంలో ఆది వారం నూతన సిఎంఇ కోర్సును ప్రారంభించారు. అనంతరం బిందుమీనన్ విలేకర్లతో మాట్లాడుతూ ఇది ఫిజిషియన్సు, న్యూరాలజిస్టులు, న్యూరోసర్జన్లకు సంబంధించిన కోర్సని పేర్కొన్నారు. ఈ కోర్సు ద్వారా ఫిజిషియన్సు ప్రాథమిక దశలోని నరాల వ్యాధులకు సంబంధించిన రోగులకు చికిత్స అందించేందుకు వీలవుతుందన్నారు. కోర్సు డైరెక్టర్లుగా తనతో పాటు న్యూరోసర్జన్ డాక్టర్ రవి దద్దాని పర్యవేక్షిస్తారన్నారు. అపోలో ఆసుపత్రిలో మతిమరుపు, ఫిట్స్, పక్షవాతం ఇతర నరాలకు సంబంధించిన వ్యాధులపై అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు. ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ప్రసాద్, ఆసుపత్రి యూనిట్ హెడ్ వి.నవీన్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్వేతారెడ్డి పాల్గొన్నారు.

## మెట్ల తొలగింపుకు తూట్లేనా?



నెల్లూరు నగరంలో రోడ్లను ఆక్ర మించుకుని కట్టిన మెట్లను, ర్యాంపులను తొలగించాలని, లేకుంటే చర్యలు తప్పవని కమిషనర్ పివివిఎస్ మూర్తి హెచ్చరిస్తు న్నారు. ఈ పరిస్థితులెలా ఉంటాయంటే కట్టేటప్పుడేమో కళ్లు మూసుకోవడం, కట్టుకున్నాక కూలదోస్తామనడం... ఇద్దరికీ శ్రమతో పాటు దండగ వ్యయం కూడా! ఒక అక్రమ కట్టడాన్ని కట్టేటప్పుడే అడ్డు కుంటే కట్టుకునేవాడి ఖర్చు మిగులు తుంది, కార్పొరేషన్‌కు కూలదోసే ఖర్చు మిగులుతుంది.

నెల్లూరు నగరంలో ఏ వీధిలో చూసినా ఆయా భవంతుల మెట్లు గాని, కార్లు ఎక్క డానికి వేసిన ర్యాంపులుగాని రోడ్డు మీదకు వచ్చి ఉంటాయి. నగరంలో దాదాపు 50 శాతానికిపైగా నిర్మాణాలు ఇలానే వుం టాయి. పలు వీధులలో ఈ ర్యాంపులు, రోడ్లపైకి వచ్చిన మెట్ల వల్లే ట్రాఫిక్ సమ స్యలు ఉత్పన్నమవుతున్నాయి. నగరంలో మెట్లు, ర్యాంపులు తొలగించే ప్రక్రియ చిన్నదేమీ కాదు. ఆక్రమణల తొలగింపు కంటే ఇదే పెద్దదవుతుంది. ఈ పని విజయవంతమైతే నగరంలోని ఎన్నో వీధులు విశాలంగా మారుతాయి. కాని ఈ కార్యక్రమాన్ని పూర్తి చేయగల సత్తా నగర పాలకులకుందా? అన్నదే ప్రశ్న!

### నెల్లూరు తహశీల్దారుగా

## వెంకటేశ్వర్లు

నెల్లూరు గ్రామీణ మండలం తహశీ ల్దారుగా వెంకటేశ్వర్లు నియమితుల య్యారు. ఆయన ఇందుకూరుపేట మండలం తహశీల్దారుగా పనిచేస్తూ ఇక్కడికి బదిలీ అయ్యారు. ఇక్కడ పని చేస్తున్న జనార్దనరావు దగదర్తి మండలం తహశీల్దారుగా బదిలీ అయ్యారు. నెల్లూరు రూరల్ తహశీల్దారుగా బాధ్యతలు స్వీకరించిన వెంకటేశ్వర్లుకు 'లాయర్' శుభాకాంక్షలు.

## ప్రసన్నకు తప్పిన ప్రమాదం

కోవూరు మాజీఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. అయితే గాయాలేవీ కాకుండా బయటపడ్డారు. ప్రసన్న ఇటీ వల హైదరాబాద్ నుండి తన భార్యతో కలిసి కారులో నెల్లూరొస్తుండగా చిల్డ్రన్స్ పార్కు వద్ద ఆయన ప్రయాణిస్తున్న కారు హైవేపైన లారీని గుద్దుకుంది. చిన్నపాటి గాయంతో ప్రసన్న దంపతులు ఆసు పత్రిలో చేరి తొందరగానే కోలుకున్నారు.

## నెల్లూరుకు ఏపి08

**AP 08 A0001**

రాష్ట్ర విభజన తర్వాత రవాణా శాఖలోనూ జిల్లాల వారీగా రిజిస్ట్రేషన్ నెంబర్లు మారిపోయాయి. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌లో ఇంగ్లీష్ అక్షరక్రమం ప్రకారం నెల్లూరుజిల్లాకు ఏపి26ను కేటాయించి వున్నారు. విభజన తర్వాత కూడా ఇప్పటి దాకా వాహనాల రిజిస్ట్రేషన్లు ఆ క్రమం లోనే జరుగుతూ వచ్చాయి. ప్రస్తుతం రవాణాశాఖ విభజన కూడా పూర్తి కావ డంతో ఆంధ్రప్రదేశ్‌లో మిగిలివున్న 13 జిల్లాలను ప్రామాణికంగా తీసుకుని రిజిస్ట్రేషన్ నెంబర్లను కేటాయించగా నెల్లూరుకు ఏపి08 వచ్చింది. రిజిస్ట్రేషన్ నెంబర్లను టోటల్‌గా లెక్కించే సంస్కృతి వుంది. గతంలో వున్న 26ను విడివిడిగా కలిపితే టోటల్ అంకె 8 వస్తుంది. ఇప్పుడు కూడా 8వచ్చింది. మొత్తానికి '8' నెల్లూరును వదిలిపోలేదు. ఇది మాజీఎమ్మెల్యే వివేకాకు అదృష్ట అంకె. ఆయన కార్లన్నింటికి కూడా టోటల్ 8 వచ్చేలా నెంబర్లు వేయిస్తుంటాడు.

## ఎంత 'టీ' వాడివయ్యా...

### ప్రశంసలందుకున్న ఛాయ్‌వాలా మన్సూర్‌బాషా సామాజిక దృక్పథం

ఒక్కోసారి చిన్న చిన్న వృత్తుల్లో జీవనం సాగించే వ్యక్తులు చేసే పనులు ఎంతో గొప్పగా అనిపిస్తాయి. చాలా ఆదర్శవంతంగా తోస్తాయి. కోట్లకు పడగలెత్తిన వారిలో కూడా కనిపించని ఆ బాధ్యత, ఆ సామాజిక దృక్పథం కడుపు కూటి కోసం ఏదో ఒక పనిచేసే వారిలో కనిపిస్తుంది. నెల్లూరులో ఒక ఆటో అప్పుడప్పుడు కనిపిస్తుంది. దాని వెనుక గర్భిణీలు, వృద్ధులకు ఉచితం అని వ్రాసి ఉంటుంది. ఆటో ఎక్కితే ఛార్జి 50రూపాయలకు మించక పోవచ్చు, కాని ఇక్కడ ప్రస్తావించాల్సింది, ప్రశంసించాల్సింది ఆటో ఛార్జీని కాదు, ఆ ఆటో నడిపే వ్యక్తి సామాజిక ఆలోచనా దృక్పథాన్ని. హృదయ వైశాల్యాన్ని. ఒక ఆటోవాలా రోజుకు వేలు, లక్షలు సంపాదించడు. అయినా కూడా తనకున్న దాంట్లోనే మానవతను చూపుతున్నాడు.

ఈ కోవకు చెందినవాడే మన్సూర్ బాషా. నెల్లూరు, అయ్యప్పగుడి సెంటర్‌లో టీ దుకాణం నడుపుతున్నాడు. ఒకరోజు అతని కొట్టు ఎదురుగానే జరిగిన యాక్సిడెంట్‌లో బైక్ నడుపుతున్న వ్యక్తి హెల్మెట్ లేని కారణంగా తల పగిలి చనిపోయాడు. అది చూసినప్పటి నుండి మన్సూర్ బాషా మనసు చలించిపోయింది. అప్పటి నుండి తన వద్దకు వచ్చే యువకులను హెల్మెట్లు పెట్టుకుని బైక్‌లు తోలండని చైతన్య పరచడమేకాక, తన వద్ద టీ తాగిన వారందరికీ నెంబర్లు ఇచ్చి వారానికొకసారి లక్కీ డ్రా నిర్వహిస్తు న్నారు. ఈ డ్రాలో విజేతలైన ముగ్గురికి హెల్మెట్లను ఉచితంగా అందిస్తున్నారు. ఆదివారం 5వ నగర ఎస్ఐ జగత్‌సింగ్ చేతుల మీదుగా లక్కీ డ్రా తీయించి ముగ్గు రికి హెల్మెట్లను అందజేశారు. ఇక్కడ హెల్మెట్ల ఖర్చు తక్కువ కావచ్చు. కాని ఆ పనిలో వున్న స్ఫూర్తి కోట్లతో విలువ కట్టలేనిది. శెభాష్ మన్సూర్ బాషా!


## వీనుల విందుగా బాలమేధావుల సంగీతఝరి



నెల్లూరు సంస్కృతి తరంగాలు ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నెల్లూరు టౌన్‌హాలు స్మారక భవనం ఏసి హాలులో ఆదివారం రాత్రి అద్భుత బాల మేధావుల శాస్త్రీయ సంగీత కీర్తనలు సభికులను విశేషంగా ఆకట్టుకున్నాయి. రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీ చేతుల మీదుగా బాల ప్రతిభ అవార్డు అందుకున్న బెంగుళూరుకు చెందిన బి.పి.అదితి ప్రహ్లాద(13) ఆలపించిన సుమధుర కీర్తనలకు వాయిద్య సహకారాన్ని విజయవాడకు చెందిన కె.విష్ణుభట్ల శివాని(11) వయోలిన్‌పై, కె.అరవింద్(15) మృదంగంపై సహకార మందించారు. నగర ప్రముఖులు దేవరాల సుబ్రహ్మణ్యంయాదవ్, వీరిశెట్టి హజరత్‌బాబు, నలుబోలు బలరామయ్య నాయుడు, బి.వి.నరశింహం, సి.మునికుమార్, నరశింహారావు, జి.సుభద్రా దేవి తదితరులు పాల్గొన్నారు. ట్రస్టు వ్యవస్థాపకులు అడ్వకేట్ రేణిగుంట రాజశేఖర్ ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

### ముసవ్విర్ మరో అద్భుతం

## కంటిలో ఏడు జాతీయ జెండాలు



వెండి, స్వర్ణంతో గతంలో అనేక సూక్ష్మ కళా రూపా లను తయారుచేసి అందరి ప్రశంసలందుకున్న నెల్లూరు జెండావీధికి చెందిన స్వర్ణకారుడు డాక్టర్ షేక్ ముసవ్విర్ రిపబ్లిక్‌డే సందర్భంగా 140మి.గ్రా బంగారంతో ఏడు జాతీయ జెండాలను కంటిలో వుంచి అందరిని అబ్బురపరిచి ప్రజలందరికీ రిపబ్లిక్‌డే శుభాకాంక్షలు తెలియజేశాడు.

# దేశభక్తికి ప్రతీకలు చిన్నారులు

## - 'వాత్సల్య'లో గణతంత్ర వేడుకల్లో వేమిరెడ్డి



చిన్నారుల్లో దేశభక్తిని పెంపొందించాలని, వారిలో మంచి క్రమశిక్షణ, చక్కని సంస్కారం పుట్టిపడేలా తీర్చిదిద్దాల్సిన బాధ్యత అందరిపై వుందని ప్రముఖ పారిశ్రామికవేత్త, వితరణ గుణశీలి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి అన్నారు. గణతంత్ర దినోత్సవాల్లో భాగంగా ఈ నెల 26న నెల్లూరులో జనహిత-వాత్సల్య ఆధ్వర్యంలో నడుస్తున్న భారతీయ విద్యావికాస్ ఇంగ్లీష్‌మీడియం హైస్కూల్ ఆవరణలో జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని పతాకావిష్కరణ గావించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎందరో మహనీయుల త్యాగఫలంతో మనకు స్వాతంత్ర్యం సిద్ధించిందని, ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన మనదేశాన్ని మనం పరిరక్షించుకోవాలని అన్నారు. 'కిమ్స్' ఆసుపత్రికి చెందిన గుండెవ్యాధుల నిపుణులు డాక్టర్ సిఎస్ శ్రీనివాసరాజు మాట్లాడుతూ, పిల్లలు తల్లిదండ్రుల పట్ల గౌరవంతో మెలగాలని, అదేవిధంగా పిల్లల పట్ల తల్లిదండ్రులు బాధ్యతతో వ్యవహరించాలని, పిల్లలను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాలని అన్నారు. జనహిత-వాత్సల్య గౌరవాధ్యక్షుడు సామంతు గోపాలరెడ్డి ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించగా, 'లాయర్' వారపత్రిక సంపాదకుడు తుంగా శివప్రభాత్‌రెడ్డి, సామాజిక సమరసతా వేదిక శ్యాంప్రసాద్, రామకృష్ణ సేవాసమితి జిల్లా కార్యదర్శి మోదం మల్లికార్జున, స్కూల్ కరెస్పాండెంట్ జి.వి సాంబశివరావు, జనహిత సంఘటనా కార్యదర్శి టివిఎస్ దుర్గాప్రసాద్, ప్రధానోపాధ్యాయుడు మధుసూదనరెడ్డి, ఎం.వి చలం తదితరులు పాల్గొన్నారు. తొలుత, చిన్నారులు ఆలపించిన అన్నమయ్య కీర్తనలు, ప్రదర్శించిన నృత్యాలు, కోలాటం తదితర సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ అలరించాయి.



## ● బాబొచ్చాడు... జాబ్ పోయింది

# రోడ్డున పడ్డ ఆరోగ్యమిత్రులు




జాబు కావాలంటే బాబు రావాలి... 2014 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఎన్నికల స్లోగన్ ఇది. బాబు వచ్చాడు గాని జాబులు రావడం అటుంచి వున్న జాబులు పోతున్నాయి. 'ఎన్టీఆర్ వైద్యసేవ' పథకంలో పని చేస్తున్న ఆరోగ్య మిత్రల తొలగింపుకు రాష్ట్ర ప్రభుత్వం జిఓ నెం.28ని జారీ చేయడం జరిగింది. వీరి తొలగింపుకు ప్రభుత్వం చూపుతున్న కారణం ఒకటే! అనర్హులను గతంలో ఆరోగ్యమిత్రలుగా తీసుకున్నారని, వైద్య సేవలపై వారికి అవగాహన లేదని. ఈ జిఓ ద్వారా నెల్లూరుజిల్లాలో 143మంది ఆరోగ్యమిత్రలు, 6మంది టీమ్ లీడర్ల ఉద్యోగాలు పోనున్నాయి. 2008 ఏప్రిల్‌లో వీరంతా ఔట్‌సోర్సింగ్ క్రింద ఉద్యోగాలలో చేరారు. వీరికి నిబంధనల ప్రకారం జీతాలు రావడం లేదు. నెలకు 7280 రూపాయలు వేతనంగా చెల్లిస్తున్నారు. తమను రెగ్యులైజ్ చేయాలని వీళ్లు డిమాండ్ చేస్తున్న తరుణంలో అసలు ప్రభుత్వం వీళ్ల ఉద్యోగాలను ఊడబెరికి నడిరోడ్లో నిలబెట్టడమే విమర్శలకు తావిస్తోంది.

2008లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం అమలుకు గాను వీరిని తీసుకోవడం జరిగింది. ఆరోజు ఇంటర్, డిగ్రీ వారిని కూడా తీసుకున్నారు. ఆరోజున్న రాజకీయ పరిస్థితులను బట్టి అధికార పార్టీ నాయకుల సిఫార్సుల ప్రకారం కొందరికి ఉద్యోగాలు ఇచ్చి ఉండొచ్చు. అయితే ఇన్నేళ్ల సర్వీసులో ఆరోగ్యమిత్రల కారణంగా ఫలానా పొరపాటు జరిగిందని ఎక్కడా లేదు. కాని ఈ ఉద్యోగులపై కూడా అధికారపార్టీ ముద్ర వేసుకునేందుకే ఉన్నఫళంగా వీరిని రోడ్డున పడేసారు. కొత్తగా ఉద్యోగ నియామకాలకు విద్యార్హత నిబంధనలు మార్చారు. కొత్తగా తీసుకునే ఉద్యోగులకు ఈ విద్యార్హతలు అమలు చేయాలిగాని ఆల్‌రెడీ ఎంతో కాలంగా సేవలందిస్తున్న వాళ్లను ఈ కుంటి సాకులతో బయటకు పంపడం నిరుద్యోగుల పొట్టకొట్టడమే!

# విద్యార్థుల్లో సేవా గుణాన్ని పెంచాం

## ● నెపస్మా జనరల్‌బాడీ సమావేశంలో వక్తలు




నెల్లూరుజిల్లా ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యాల అసోసియేషన్(నెపస్మా) జనరల్‌బాడీ సమావేశం ఈ నెల 24వ తేదీ జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా యం.వి.సుబ్బారెడ్డి పాల్గొని మాట్లాడుతూ కర్నూలు, విశాఖలో సంభవించిన తుఫానులో, ఇటీవల నెల్లూరు వరదల సమయంలో విద్యార్థుల్లో దేశభక్తిని, సేవాగుణాన్ని అలవర్చడం కోసం ప్రయత్నించామని, ప్రైవేటు పాఠశాలలు సమాజ కార్యక్రమాలలో ముందుంటాయని తెలిపారు.

నెపస్మా జిల్లా అధ్యక్షులు మనోహర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆయన ప్రైవేటు పాఠశాలల సమస్యలను గురించి చర్చించారు. ప్రైవేటు పాఠశాలల ఐఐటి ఫౌండేషన్ కోర్సును ప్రారంభించాలని, దానికి తగ్గ మెటీరియల్, ట్రైనింగ్‌ను నెపస్మా ద్వారా అందిస్తామన్నారు. ఈ సందర్భంగా మన ఇల్లు - మన రాజధాని కార్యక్రమంలో భాగంగా మాజీ శాసన సభ్యులు ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి కరస్పాండెంట్లను కలిసి ఈ మహాయజ్ఞంలో భాగస్వాములై గొప్ప రాజధానిని నిర్మించి భావితరాలకు అందించాలనే గొప్ప పనిలో మీముందుకు వచ్చినట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో నెపస్మా జిల్లా ఉపాధ్యక్షులు నేలనూతల శ్రీధర్, శ్రీకాంత్‌రెడ్డి, కార్యదర్శి వై.వెంకటరామయ్య, కోశాధికారి వై.మల్లికార్జునరెడ్డి, వివిధ నియోజకవర్గాల అధ్యక్షులు, నెపస్మా నగర అధ్యక్ష కార్యదర్శులు శౌరిరెడ్డి, రవికుమార్, కోశాధికారి కృష్ణారావు పాల్గొన్నారు.

# పారదర్శకంగా పనులుండాలి



ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులతో చేపట్టే పనులు పారదర్శకంగా ఉండాలని, ఏ మాత్రం తేడాలొచ్చినా ఒప్పుకోనని నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అంటున్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను సక్రమంగా వినియోగించకపోతే బాధ్యులైన వాళ్లు ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం క్రింద శిక్షార్హులవుతారని ఆయన హెచ్చరించారు. 24వ తేదీన ఆయన నెల్లూరులోని హరనాథపురం, గోమతినగర్, సర్వేపల్లి కాలువ కట్ట ప్రాంతాల్లో పర్యటించారు. అక్కడి ప్రజల సమస్యలు తెలుసుకుని, యుద్ధప్రాతిపదికన వాటిని పరిష్కరించాలని అధికారులను కోరారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు విడుదలపై సంతోషం వ్యక్తం చేస్తూ, ఈ పనులు శుభ్రంగా జరిగేలా నిరంతరం పర్యవేక్షిస్తానన్నారు కోటంరెడ్డి.

# సిఎంఆర్‌లో ముగిసిన పండుగల డ్రాలు




చందన, సిఎంఆర్, క్రిస్మస్, న్యూ ఇయర్, సంక్రాంతి పండుగల సందర్భంగా సంక్రాంతి బంపర్‌డ్రా(రెనాల్ట్ క్విడ్ కారు) సోమవారం రాత్రి నిర్వహించారు. నెల్లూరుజిల్లా కలెక్టర్ ఎం.జానకి చేతుల మీదుగా విజేతను ఎంపిక చేశారు. నెల్లూరు జిల్లా బాలాయపల్లి మండలం, గాజులపల్లికి చెందిన కె.కోటేశ్వరరావు(కూపన్ నెం.162397)ను విజేతగా కలెక్టర్ ప్రకటించారు. న్యూఇయర్ కారు విజేత నెల్లూరు శెట్టిగుంట రోడ్డుకు చెందిన మౌనిక జ్యోతికి రెనాల్ట్ క్విడ్ కారు కీని కలెక్టర్ జానకి అందజేశారు. అలాగే డైలీ డ్రా విజేతలకు బహుమతులు అందజేశారు. సిఎంఆర్ అధినేత మావూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ పండుగల సందర్భంగా ప్రవేశపెట్టిన ఈ స్కీములు, బహుమతులకు ప్రజల్లో మంచి స్పందన వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో రాజీ యాడ్స్ అధినేత మోహూరు పెంచలయ్య, శైలేష్, మేనేజర్ వాసు పాల్గొన్నారు.

# అవయవదాత కుటుంబానికి ఆర్థిక సాయం



తాను ప్రాణాలు వదులుతూ నలుగురికి ప్రాణదానం చేసే విధంగా తన అవయవాలు దానం చేసిన సుభాషిణి కుటుంబానికి తోడ్పాటుగా నెల్లూరులోని నేస్తం ఫౌండేషన్ సంస్థ ఆదివారం రూ.10,500లు ఆర్థికసాయం అందజేశారు. నెల్లూరు నగరానికి చెందిన షేక్ నాయబ్ బాషా, విశ్వశాంతి సహకారంతో నెల్లూరుజిల్లా సంగంకు వెళ్ళి సుభాషిణి కుటుంబసభ్యులను పరామర్శించి ఈ మొత్తాన్ని వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో నేస్తం ఫౌండేషన్ అధ్యక్షులు కోరెం ప్రవీణ్‌కుమార్, కార్యవర్గసభ్యులు రాచర్ల వెంకట్, వినోద్, నవీన్, చెన్న కృష్ణయ్య, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్ వార్తలు

## వరద సహాయకులకు అవార్డులు



సబ్‌కలెక్టర్ చేతుల మీదుగా అవార్డునందుకుంటున్న డాక్టర్ సి.జనార్ధన్‌రెడ్డి, డాక్టర్ సి.రోహిణి, విష్ణువందన తదితరులు

నవంబర్‌లో సంభవించిన వరదలకు ఆంధ్ర మహిళా మండలి గౌరవాధ్యక్షురాలు డాక్టర్ సి.రోహిణి, అధ్యక్షురాలు విష్ణువందన సహకారంతో వారం రోజుల పాటు ముంపు ప్రాంతాలకు వెళ్ళి ఆహార పొట్లాలను, వాటర్ ప్యాకెట్లు, పేద పిల్లలు, పెద్దలకు దుస్తులు ఇవ్వటం, మహిళా మండలి సభ్యురాలు ఎల్లసిరి లక్ష్మి సహకారంతో దుప్పట్లు పంపిణీ చేయడంతో పాటు డాక్టర్ సి.ఆర్.రెడ్డి హాస్పిటల్ సహకారంతో డాక్టర్ సి.రోహిణి, డాక్టర్ సి.జనార్ధన్‌రెడ్డి, డాక్టర్ సుగుణలు మెడికల్ క్యాంపులు నిర్వహించి బాధితులను ఆదుకున్నందుకుగాను ప్రభుత్వం వారి సేవలను గుర్తించింది. రిపబ్లిక్‌డే సందర్భంగా డాక్టర్ సి.జనార్ధన్‌రెడ్డికి, డాక్టర్ సి.రోహిణి, విష్ణువందన, సభ్యులకు గూడూరు సబ్‌కలెక్టర్ పిఎస్ గిరీషా చేతులమీదుగా అవార్డు ప్రదానం జరిగింది.

## మురిపించిన మువ్వన్నెల జెండా

67వ గణతంత్ర దినోత్సవాన్ని మంగళవారం గూడూరులోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ గిరీషా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడుతూ గూడూరు డివిజన్ అభివృద్ధి పథంలో పయనిస్తుందన్నారు. అనంతరం సబ్ కలెక్టర్, ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, డిఎస్పీ బాదిపల్లి శ్రీనివాస్, ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన విద్యార్థుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ ఎందరో మహానుభావులు ఎన్నో త్యాగాలు చేసి స్వేచ్ఛాస్వాతంత్ర్యాన్ని తీసుకొచ్చారన్నారు. వారి ఆశయాలకు అనుగుణంగా యువత ముందడుగు వేసి దేశాభివృద్ధికి కృషి చేయాలన్నారు. పేద విద్యార్థులను విద్య, క్రీడల పరంగా అభివృద్ధి పరిచేందుకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టిందన్నారు. డివిజన్‌లో



జాతీయ జెండాకు వందనం చేస్తున్న సబ్‌కలెక్టర్ గిరీషా

అభివృద్ధి కోసం ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి రైతులు, పేద ప్రజలను ఆదుకునేందుకు ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తుందన్నారు.

ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, డిఎస్పీ బి.శ్రీనివాస్‌లు మాట్లాడుతూ పాలనా పరంగా స్వాతంత్ర్యం వచ్చిందని మరింత అభివృద్ధి సాధించేందుకు అందరూ కృషి చేద్దామన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన పలు సాంస్కృతిక, యోగా కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వరదల సమయంలో బాధితులను ఆదుకునేందుకు కృషి చేసిన వారికి సేవాపత్రాలు అందజేశారు. సాంస్కృతిక కార్యక్రమాలలో విజేతలకు బహుమతులు అందజేశారు.

ఈ కార్యక్రమంలో డిప్యూటి డిఎం హెచ్‌వో డాక్టర్ ఈదూరు సుధాకర్, ఎవో గీతావాణి, డాక్టర్ సి.జనార్ధన్‌రెడ్డి, డాక్టర్ రోహిణి, కె.మునిగిరీష్ తదితరులు పాల్గొన్నారు.

## డిఆర్‌డబ్ల్యూ కళాశాలలో ఫుడ్ టెక్నాలజీ డిప్లొమా కోర్సులు



కోర్సులను ప్రారంభిస్తున్న విజయనంద్, ప్రక్కన డాక్టర్ సిఆర్ రెడ్డి, సుందరరామిరెడ్డి తదితరులు

గూడూరు డిఆర్‌డబ్ల్యూ కళాశాలలో ఉచిత ఫుడ్ టెక్నాలజీ డిప్లొమా కోర్సులను విక్రమ సింహపురి అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ విజయనంద్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందుబాటులో ఉన్న వనరులతో తక్కువ ఖర్చుతో పోషక విలువలు కలిగిన ఆహారాన్ని ఎలా తయారు చేసుకోవాలనే అంశాలపై శిక్షణ ఇస్తారన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ సి.ఆర్.రెడ్డి, ప్రిన్సిపాల్ శ్యామలమ్మ, గాయత్రి, సుజీవన, సుమతి, కె.సుందరరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## దేశ భవిష్యత్తుకు రూటు... ఓటు

దేశ భవిష్యత్తును నిర్ణయించేది ఓటు అని ఏడవ అదనపు జిల్లా మేజిస్ట్రేట్ గుర్రప్ప అన్నారు. సోమవారం ఆరవ జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ర్యాలీని సబ్‌కలెక్టర్ గిరీషా ప్రారంభించారు. ఈ ర్యాలీ టవర్ క్లాక్, హాస్పిటల్ రోడ్డు, ఐసిఎస్ రోడ్డు మీదుగా సాగి డిఎన్ఆర్ కమ్యూనిటీ హాల్‌కు చేరుకుంది. టవర్‌క్లాక్ కేంద్రం వద్ద అధికారులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధులు, విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. అనంతరం స్థానిక డిఎన్ఆర్ కమ్యూనిటీ హాలులో ఏర్పాటు చేసిన సమావేశంలో గుర్రప్ప మాట్లాడుతూ కుల, మత, పేద, ధనిక అనే తేడా లేకుండా 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు లభిస్తుందన్నారు. ప్రజాస్వామ్యంలో దేశాన్ని పాలించే నాయకులను ఓటు ద్వారా ఎన్నుకోవచ్చన్నారు. ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, సబ్ కలెక్టర్ గిరీషా మాట్లాడుతూ ఓటు బ్రహ్మాస్త్రం లాంటిదన్నారు. విద్యార్థులు నిరక్షరాస్యులుగా ఉండి ఓటును నమోదు చేసుకోని వారిని గుర్తించి ఓటు హక్కు వినియోగించుకునేలా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన, డిఎస్పీ బి.శ్రీనివాస్, కమిషనర్ మోదకొండ, ఎన్‌కెఆర్ కళాశాల ప్రిన్సిపాల్ సరళకుమారి, కౌన్సిలర్లు, వివిధ స్వచ్ఛంధ సంస్థలు, నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## డ్రైవర్ల చేతుల్లోనే ప్రయాణీకుల భద్రత



డ్రైవర్‌ను సన్మానిస్తున్న రైల్వేస్టేషన్ మేనేజర్ పి.వి.రావు

గూడూరు డిపో ప్రమాద రహితంగా గుర్తింపు తెచ్చుకోవాలని గూడూరు రైల్వేస్టేషన్ మేనేజర్ పి.వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం గూడూరు ఆర్టీసీ డిపోలో రోడ్డు భద్రతా వారోత్సవాలలో భాగంగా ఉత్తమ డ్రైవర్లను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవర్లు జాగ్రత్తగా రోడ్డు నిబంధనలు పాటిస్తూ ప్రయాణీకులను సురక్షితంగా గమ్యానికి చేర్చే బాధ్యత ఉందన్న విషయాన్ని గుర్తెరిగి డ్రైవింగ్ చేయాలన్నారు. డ్రైవర్ చిన్నపాటి తప్పు చేసినా బస్సులో ప్రయాణించే ప్రయాణీకుల ప్రాణాలు గాలిలో కలుస్తాయన్నారు. దీంతో డ్రైవర్లు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ కార్మికులు, అధికారులు పాల్గొన్నారు.

## బలిజలను బి.సిల్లో చేర్చాలి



# శ్రీకాళహస్తి న్యూస్



ఇటీవల చిత్తూరు జిల్లా శ్రీకాళహస్తి పట్టణంలో బలిజ కులస్తుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సభకు బలిజ నాయకులు అంజూరు శ్రీనివాసులు అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా చిత్తూరు బలిజ ఐక్యవేదిక కన్వీనర్ ఎ.ఎస్.మనోహర్, తిరుపతి బలిజ నాయకులు పోకల అశోక్‌కుమార్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎ.ఎస్.మనోహర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు బలిజ కులస్థులను బి.సి.ల్లో చేర్చాలని కాపు కార్పొరేషన్ పేరుతో కాలయాపన చేస్తున్నారన్నారు. 100 కోట్ల రూపాయలు కేటాయించినా సంవత్సర ఆదాయం రూ.60వేలు మించరాదని షరతు పెట్టి కాపు విద్యార్థులను కనీస స్కాలర్‌షిప్‌లకు దూరం చేసే విధంగా జి.ఓ.ఎం.ఎస్.నెం.15ను ప్రవేశపెట్టారన్నారు. పోకల అశోక్‌కుమార్ మాట్లాడుతూ బలిజ కులస్థులు రాయలసీమ ప్రాంతంలో చాలా వెనుకబడి ఉన్నారని, విద్యా, రాజకీయ పరంగా రిజర్వేషన్లు ఉంటే ముందుకు రాగలన్నారు. వై.ఎస్.ఆర్. పార్టీ చిత్తూరు జిల్లా ప్రతినిధి అంజూరు తారక శ్రీనివాసులు మాట్లాడుతూ 1920–1956 మద్రాసు ఉమ్మడి రాష్ట్రంలో బలిజ కులస్థులకు బి.సి. రిజర్వేషన్ ఉండేదని, ప్రత్యేక ఆంధ్రప్రదేశ్ ఏర్పడినపుడు అప్పటి ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య బలిజ కులస్థులకు బి.సి. రిజర్వేషన్లు కొనసాగించారన్నారు. నీలం సంజీవరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు బి.సి.రిజర్వేషన్లు తొలగించారని, కనుక లేని రిజర్వేషన్లు కొత్తగా అడగడం లేదని, ఉన్న రిజర్వేషన్లను కొనసాగించాలన్నారు. అన్ని పార్టీల నాయకులు బలిజ కులస్థుల కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. పట్టణాధ్యక్షులు మందల బాలాజీ మాట్లాడుతూ పట్టణంలోని పెండ్లిమండపం వద్ద అన్ని పార్టీలకు చెందిన బలిజ నాయకులు దీక్షలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిద్దులుగారి జయబాబు, కోలా గోవర్ధన్, పూలకృష్ణమూర్తి, గాజుల సత్యం, అంజూరు వెంకటేష్‌బాబు, చింతామణి పాండు, శేఖర్, నరేష్, గోప, శరవణ కుమార్, కౌన్సిలర్ డిష్ ధర్మయ్య, జయశ్యామ్, పవన్, మున్నా, గంగాధర్, లోకేష్, సుధాకర్, లీలాకుమార్ పాల్గొన్నారు.

## వేడుకగా రిపబ్లిక్ డే

శ్రీకాళహస్తి పట్టణంలోని శ్రీకాళహస్తీశ్వరాలయం స్కిట్ కళాశాలలో ట్రస్టుబోర్డు చైర్మన్ పోతుగుంట గురవయ్యానాయుడు, ఆలయ కార్యనిర్వహణాధికారి డి.భ్రమరాంబ 67 వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని జెండాను ఆవిష్కరించారు. సభ్యులు ప్రమీలమ్మ, కంద్రిగ ఉమ, బాలాజీ, లోకనాథంనాయుడు తదితరులు పాల్గొన్నారు. అలాగే మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ శ్రీనివాస శర్మ జెండాను ఆవిష్కరించగా చైర్మన్ పేట రాధారెడ్డి , వైస్‌చైర్మన్ పార్థసారధి, కౌన్సిలర్లు, కో – ఆప్షన్ మెంబర్లు తదితరులు పాల్గొన్నారు. తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ చంద్రమోహన్ జెండాను ఆవిష్కరించారు.

**మేషం**



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

చేపట్టిన పనులు విజయవంతంగా పూర్తి చేస్తారు. ఆందోళన తగ్గి కొంత ప్రశాంతత లభిస్తుంది. వృత్తి వ్యాపారాల పెరుగుదలకు కృషి చేసి ఆదాయం పెంచు తారు. అయితే హడావిడిగా ప్రవర్తన ఉంటుంది. ఆరోగ్య విషయంలో శ్రద్ధ అవసరం. ప్రభుత్వ పరంగా రావలసిన అనుమతులు, ఋణాలు లభించగలవు. ఉద్యోగ ప్రయ త్నాలు ఆశాజనకంగా ఉంటాయి.

**కన్య**



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

ఆర్థిక వనరులు బాగుంటాయి. ఆదాయం బాగుండి వృత్తి వ్యాపారాలు లాభసాటిగా ఉంటాయి. అయితే ఖర్చులు కూడా పెరిగి, అదుపు లేకపోవచ్చును. ఆశిం చిన ఋణాలు, ప్రభుత్వ అనుమతులు పొందగలరు. కొత్త పెట్టుబడులకు అవకాశాలు, ఉద్యోగావకాశాలు లభించగలవు. కమిటీ సమావేశాలకు, సభలకు ఆహ్వా నాలు పొందగలరు. కుటుంబసౌఖ్యం బాగుంటుంది.

**వృశ్చికం**



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

ఖర్చుల భారం పెరిగి అవసరాలకు ఋణాలు చేయ వలసి వస్తుంది. పెట్టుబడుల విషయం, స్థిరాస్తుల లావాదేవీల విషయం కొంతకాలం వాయిదా వేయండి. కాంట్రాక్టర్లు, బిల్డర్లు కొంత ఇబ్బందులనెదుర్కొంటారు. ఏ ముఖ్యనిర్ణయాలైనా ఇతరుల సలహాలను తీసికొని చేయండి. ఉద్యోగులు తమపైగల అధికారులతోను పబ్లిక్‌తోను జాగ్రత్తగా మెలగండి.

**వృషభం**



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

ఆదాయానికి సమతుల్యంగా ఖర్చులు పెట్టవలసి వస్తుంది. ఇంటా బయటా వ్యవహారాలలో ప్రాధాన్యం పొందటం, గౌరవం బాగుంటాయి. సేవా కార్యక్రమాలలో పాల్గొనడం, సంస్థలందు పదవులు పొందడం జరుగు తుంది. వృత్తి వ్యాపారాలు సామాన్యంగా సాగుతాయి. కోర్టు వ్యవహారాలు వాయిదా పడవచ్చును. అనుకున్న పనులు నిదానంగా జరుగుతాయి.



**బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు**
బాలాజీనగర్, నెల్లూరు

## రాశి – మీ వాసి

తేది. 29.1.2016 నుండి
తేది. 4.2.2016 వరకు

ఈ వారం సింహంలో గురురాహువులు, కన్య తుల వృశ్చిక రాశులలో చంద్రుడు, తులలో కుజుడు, వృశ్చికంలో శని, ధనుస్సులో బుధశుక్రులు, మకరంలో రవి, కుంభంలో కేతువు సంచరిస్తారు.

**పంచాంగము:**
**ముహూర్తములు లేవు**

**పుష్య మాస కృష్ణపక్ష తిథులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 29 | శుక్ర | పంచమి | ప॥ గం.12.50వ॥ |
| తేది. 30 | శని | షష్ఠి | ప॥ గం.2.58వ॥ |
| తేది. 31 | ఆది | సప్తమి | సా॥ గం.5.08వ॥ |
| తేది. 1 | సోమ | అష్టమి | రా॥ గం.7.07వ॥ |
| తేది. 2 | మంగళ | నవమి | రా॥ గం.8.51వ॥ |
| తేది. 3 | బుధ | దశమి | రా॥ గం.10.08వ॥ |
| తేది. 4 | గురు | ఏకాదశి | రా॥ గం.10.58వ॥ |

**ధనుస్సు**



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

వ్యాపార వర్గాలకు మంచి అవకాశాలు లభించ వచ్చును మరియు ఆదాయం తృప్తికరం. వృత్తి జీవనం కలవారికి సామాన్య స్థితి ఉంటుంది. ప్రవర్తన, మాట తొందరపాటు వలన సమస్యలు రావచ్చును. యజమాను లకు వర్కర్లతో ఇబ్బందులుంటాయి. కొత్త పెట్టుబడులకు అవకాశాలు షేర్లమీద లాభాలుంటాయి. శుభకార్యాలు నిర్ణయం కాగలవు. విద్యా ప్రగతి బాగుంటుంది.

**మిథునం**



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

వృత్తి వ్యాపారాల పెరుగుదలకు బాగా కష్టపడతారు. ఆదాయం పెరుగుతుంది. కొత్త వస్తువులను కొనడం, కొత్త పెట్టుబడులకు వ్యాపార భాగస్వామ్యాలకు అవకాశాలు దొరకడం జరుగుతుంది. సోదర వర్గంతో గాని బంధువర్గంతో గాని సమస్యలు రాకుండా చూచు కొనండి. యాజమాన్య పరిశ్రమలకు వర్కర్లతో ఇబ్బం దులు రావచ్చును. విద్యా ప్రగతి బాగుంటుంది.

**మకరం**



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

కుటుంబంలో అభిప్రాయ భేదాలుండవచ్చు, కాబట్టి సర్దుబాటు చేసికోవాలి. అనుకున్న పనులు సరిగా జరగవు. కుటుంబ సభ్యులకు, బంధుముఖ్యులకు అనారోగ్య బాధలుంటాయి. వృత్తి వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. ఆర్థికాభివృద్ధి అవకాశాలు తగ్గుతాయి. బంధువర్గంతో మిత్రులతో విభేదాలు రావచ్చును. చదువులపై ప్రత్యేక శ్రద్ధ అవసరం.

**కర్కాటకం**



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

ఈ వారం నుండి చేయదలచిన పనులకు ఆటంకాలు కలగడం ఎక్కువగా మానసికాందోళన ఉంటుంది. ఉద్యోగులకు పని భారం, బయట నుండి పని వత్తిడులు ఎక్కువగా ఉంటాయి. వృత్తి వ్యాపారాలలో కొంత అభివృద్ధి ఆదాయం పెరగడం ఉంటుంది. ఇచ్చిన వాగ్దానాలను అమలు పరుస్తారు. కొత్త ఆర్థిక అవకా శాలు, పెట్టుబడులు పెరగడం ఉంటుంది.

**కుంభం**



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

స్థిరాస్తుల లావాదేవీలు జరపడం, కొత్త వస్తువులు సమకూర్చుకొనడం జరుగవచ్చును. కుటుంబంలో కొద్దిగా అనుకూలత ఉండదు కాబట్టి సర్దుకొని పోవడం మంచిది. వృత్తి వ్యాపారాలలో అవకాశాలు బాగుంటాయి. ఆదాయం పెరుగుతుంది. అనుకున్న పనులు పట్టుదలతో నెరవేర్చుకొంటారు. ఉద్యోగులకు పని సామర్థ్యం, అధి కారులకు స్థానమార్పులుండవచ్చును. విద్యా ప్రగతి బాగుంటుంది.

**సింహం**



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

ఆర్థిక వ్యవహారాలు, కుటుంబ వ్యవహారాలను చక్క బెట్టగలరు. మంచి వ్యాపారావకాశాలు దొరకడం, ఆదాయవృద్ధి, వృత్తి జీవనం వారికి రాబడితో పాటు సంతృప్తి ఉంటుంది. చేపట్టిన పనులకు కొద్ది ఆటంకాలు రావడం, టెన్షన్ పడటం జరుగుతుంది. స్థిరాస్తుల లావా దేవీలు నిర్వహించడం, ఇతరులకు ఏదో ఒక రూపంలో సహాయపడటం జరుగుతుంది.

**తుల**



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

నిర్ణయాలు సరైన విధంగా తీసికొనడం, అనుకున్న పనులు జరపడం చేస్తారు. వృత్తి వ్యాపార జీవనం కల వారికి ఆర్థికాభివృద్ధి ఉండి రాబడి పెరుగుతుంది. సభలు సమావేశాలలో మీ మాటలకు ఆమోదం, గుర్తింపు ఉంటుంది. స్థిరాస్తుల లావాదేవీలు జరుపుతారు. ఉద్యో గులకు ఆదరణ ప్రోత్సాహకాలు లభిస్తాయి. కుటుంబ సభ్యులతో సామరస్యంగా మెలగండి.

**మీనం**



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

వృత్తి వ్యాపారాలు అభివృద్ధికరంగా ఉండినా, ఖర్చులు కూడా పెరిగి ఇబ్బందులుండగలవు. ఆస్తి వ్యవహారాలు వాయిదా వేయడం మంచిది. వాహనాలు నడిపేవారు, యంత్రాలతో పని చేసేవారు జాగ్రత్తగా మెలగండి. గాయాలు తగలవచ్చును. స్థిరాస్తులు షేర్ల మీద ఆదాయం ఉంటుంది. బంధువర్గాన్ని కలుసుకొంటారు. శుభ కార్యాలు నిర్ణయం కాగలవు.

# దేశంలో కాంగ్రెస్ వాళ్ళకే మర్యాదలు



*భేతాళ కథ*

పట్టువదలని హైటెక్ విక్రమార్కుడు ఎర్లీమార్నింగ్ ఎయిట్‌థర్టీకల్లా నిద్ర లేచాడు. కాలకృత్యాలు ముగించి, నీట్‌గా ముస్తాబై మురళీకృష్ణ హోటల్‌కెళ్లి మూడు ఇడ్లీలతో మూడు బకెట్ల సాంబార్‌ను లాగించేసి రోడ్డు మీదకొచ్చాడు. ఆటో ఎక్కుదామని చేయి పూపగానే డజను ఆటోలు అతని ముందు నిలిచాయి. ఏ ఆటోలో ఎక్కాలో తెలియని అయోమయ పరిస్థితుల్లో అతనున్నప్పుడు ఒక ఆటోవాలా ఒడుపుగా విక్రమార్కుడి చొక్కా పట్టుకుని తన ఆటోలోకి లాగేసి రయ్‌మంటూ దూసుకుపోయాడు. పెద్దాసుపత్రి వద్ద ఆటో దిగి లోపలకు వెళ్లాడు. మార్చురీ లోకెళ్లి రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఓ వ్యక్తి బాడీని భుజాన వేసుకుని బోడి గాడి తోటలోని రోటరీ క్లబ్ శ్మశాన వాటిక వైపు నడవసాగాడు. ఎల్‌ఐసి ఆఫీసు వద్దకు రాగానే బాడీలోని భేతాళుడు... రాజా! ఎవరు ఏ పార్టీలో వున్నారో, ఏ పార్టీలోకి మారుతున్నారో తెలియని పరిస్థితులున్న నెల్లూరులో నువ్వు పడుతున్న కష్టాన్ని చూస్తుంటే నెల్లూరుజిల్లా తెలుగుదేశం నాయకులు గుర్తొస్తున్నారు. వాళ్లు కూడా నీలాగే జెండాలు మోసి మోసి చివరకు ఎందుకూ పనికిరాని వాళ్లయ్యారు అని చెప్పాడు. ఎవరా తెలుగుదేశం నాయ కులు, ఏమా కథ అని విక్రమార్కుడు ప్రశ్నించాడు. ఇది రోడ్డు మీద చెప్పుకునే కథ కాదు, అలా మాగుంట లే అవుట్‌లో 'కాఫీడే'లో కూర్చుని చెప్పుకుందాం పద అంటూ భేతాళుడు మాగుంట లే అవుట్ వైపు నడిపించాడు. కాఫీడేలో కూర్చున్నాక భేతాళుడు ఆకలిగా వుండడంతో 10 కేక్‌లు, 10పిజ్జాలు, నాలుగు ఐస్‌క్రీంలు తినగా, విక్రమార్కుడు మాత్రం కాఫీ ఆర్డరిచ్చి... భేతాళ ఇక చెప్పు ఆ కథేంటో అని అన్నాడు. భేతాళుడు చెప్పడం మొదలుపెట్టాడు.

*2014* ఎన్నికల్లో రాష్ట్రంలో తెలుగు దేశం అధికారంలోకి వచ్చింది. చంద్ర బాబునాయుడు ముఖ్యమంత్రి అయ్యాడు. ఇన్నేళ్లు తెలుగుదేశం జెండాలు మోసి నందుకు ఇన్నాళ్లకు మాకు మంచిరోజు లొచ్చాయని తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలందరూ ఇంకొంచెం ఖర్చు పెట్టుకుని సంక్రాంతి, ఉగాది, రంజాన్, క్రిస్‌మస్ పండుగ సంబరాలు ఒకేసారి జరుపుకున్నారు. ఇక రాజ్యం తమదేనని, కాంగ్రెస్ హయాంలో పదేళ్లు తమను ముప్పతిప్పలు పెట్టిన వారిపై పగతీర్చుకునే సమయం వచ్చిందని తెలుగుదేశం సీని యర్ నాయకులు చంకలు గుద్దుకుంటున్న తరుణంలో చంద్రబాబు కథను అడ్డం తిప్పాడు. కాంగ్రెస్ ప్రభుత్వంలో చక్రం తిప్పిన నాయకులను తెలుగుదేశంలో చేర్పించుకోసాగాడు. ఎన్నికలప్పుడు పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డి, ముంగమూరు శ్రీధర కృష్ణారెడ్డి వంటి వాళ్లను చేర్చుకోగా, ఎన్నికల తర్వాత ఆనం జయకుమార్‌రెడ్డి, మెట్టుకూరు ధనుంజయరెడ్డి, వాకాటి నారాయణరెడ్డి వంటి వారిని చేర్చుకు న్నాడు. సూళ్లూరుపేటలో 30ఏళ్లుగా తెలుగుదేశం పార్టీకి అండగా నిలిచిన వేనాటి రామచంద్రారెడ్డి పెత్తనానికి వాకాటి నారాయణరెడ్డిని తీసుకోవడంతో గండి కొట్టినట్లయ్యింది. పార్టీకి చేసిన చాకిరివల్ల రామచంద్రారెడ్డికైతే నెత్తిమీద బొచ్చు కూడా పూర్తిగా పోయింది. ఇదంతా ఒకెత్తయితే నెల్లూరులో ఆనం బ్రదర్స్‌ను పార్టీలోకి తీసుకోవడం మరో ఎత్తు. పదేళ్లపాటు ఆనం సోదరులకు వ్యతిరేకంగానే కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, రమేష్‌రెడ్డి, కిలారి వెంకటస్వామినాయుడు వంటి వాళ్లు పోరాడారు. కోటంరెడ్డి శీనయ్య అయితే తెలుగుదేశంపార్టీ తరపున పోరాటాల కోసం ఎన్ని చొక్కాలు చించు కున్నాడో లెక్కేలేదు. అలాంటివాళ్లకు ఇప్పుడు పార్టీలో ఎలాంటి స్థానముందో చూపిస్తాను చూడు అంటూ భేతాళుడు తన సెల్‌ఫోన్ తీసి గ్యాలరీలోకి వెళ్లి "లోకేష్ బర్త్‌డే" ఫైల్‌ను ఓపెన్ చేశాడు. స్క్రీన్ మీద సీన్‌లు రాసాగాయి.

అది ఐఆర్20–420 మున్సిపల్ కార్పొరేషన్ ముదురుదోమలకు ప్రసిద్ధి గాంచిన నెల్లూరు నగరంలోని నర్తకి సెంటర్. నారా లోకేష్ జన్మదినోత్సవ వేడుకలు జరుగుతున్నాయి. నిర్వాహకులు వేదిక మీదకు ఆనం సోదరులను, వారి కుమారులను, కాంగ్రెస్ తెలుగుదేశం నాయకులైన ఆదాల ప్రభాకర్‌రెడ్డి, పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, వాకాటి నారాయణరెడ్డి వంటి నాయకులను పిలి చారు. తమను ఎప్పుడెప్పుడు పిలుస్తారా అని క్రింద వున్న రమేష్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కిలారి వెంకటస్వామి నాయుడులు ఎదురు చూడసాగారు. వీళ్లనైతే పిలవలేదుగాని స్టేజీ మీద మాత్రం కేక్ కటింగ్ అయిపోయి స్పీచ్‌లు కూడా మొదలయ్యాయి. అందరు కూడా చంద్రబాబు వంటి అత్యుత్తమ ప్రజా నాయకుడిని ప్రపంచంలోనే ఎక్కడా చూడ లేదని, మార్టిన్ లూథర్‌కింగ్, విన్‌స్టన్ చర్చిల్, అబ్రహం లింకన్ వంటి వారితో సరితూగగల నాయకత్వ సమర్థుడు చంద్ర బాబేనని కొనియాడారు. చివరగా స్టైల్ ఆఫ్ సింహపురి వివేకా(65) మాట్లా డుతూ... చంద్రబాబు గురించి మీకెవరికీ తెలియని రహస్యాలు నేను చెబుతాను... అతను లోకం చుట్టిన 'లోకనాయకుడు', దుర్మార్గాలను చీల్చి చెండాడిన 'చెన్న కేశవరెడ్డి', పేదల కోసం పుట్టిన 'సింహా', అవినీతి రాజకీయ నాయకుల అంతం చూడడానికి వచ్చిన 'లెజెండ్', తన రాష్ట్రాన్ని కాపాడుకోవడానికి నరసింహావ తారం ఎత్తిన 'నరసింహనాయుడు', చంద్రబాబు లేకుంటే ఈ రాష్ట్రం లేదు... ఆయనే లేకుంటే ఈ జనం లేరు... ఒక్క మాటలో చెప్పాలంటే ఆంధ్రప్రదేశ్ అనే భక్తుడిని కాపాడడానికి వచ్చిన అపర విష్ణుమూర్తి మన చంద్రబాబు నాయుడు అని చెప్పాడు. ఆ మాటకు ఆ ప్రాంత మంతా చప్పట్లతో మార్మోగిపోయింది.

ఇక్కడితో సెల్‌ఫోన్ స్క్రీన్ మీద సీన్‌లు ఆగిపోయాయి. అప్పుడు భేతాళుడు... రాజా! చూసావుగా తెలుగుదేశం నాయ కుల దీన పరిస్థితి. మొదట్నుండి పార్టీని నమ్ముకున్నోళ్లు స్టేజీ క్రింద వుంటే, నిన్నగాక మొన్న పార్టీలో చేరినోళ్లు స్టేజీ మీదున్నారు. తెలుగుదేశం సీనియర్ నాయకుల ఈ దౌర్భాగ్య స్థితికి కారణం చంద్రబాబు నాయుడే! అన్నీ తెలిసుండి కూడా తన పార్టీని నమ్ముకున్న వాళ్లకు ఆయన ఈ దుస్థితిని ఎందుకు కల్పించినట్లు? సమా ధానం తెలిసి కూడా చెప్పకపోయావో కోటంరెడ్డి శీనయ్య, రమేష్‌రెడ్డిల లాగే మానసిక క్షోభకు గురవుతావని బెది రించాడు.

దానికి విక్రమార్కుడు... ఇక్కడ చంద్రబాబు లాజిక్ ఒక్కటే! ఆయనకు అన్ని దారులూ తెలుసు కాబట్టి... కాంగ్రెస్ నుండి తన పార్టీలోకి వచ్చిన నాయకుల కదలికలను ఎప్పటికప్పుడు పసిగట్టగలడు. కాబట్టి వాళ్లతో డేంజర్ లేదనే పార్టీలో చేర్చుకున్నాడు. అదీగాక సీనియర్ పార్టీ నాయకులు... మేం జెండాలు మోయబట్టే పార్టీ అధికారంలోకి వచ్చిందంటారు, అదే కాంగ్రెస్ నుండి చేరే నాయకులైతే... చంద్రబాబు నాయకత్వ సామర్థ్యం వల్లే పార్టీ అధికారంలోకి వచ్చిందంటారు. వాళ్లకు వీళ్లకు అదే తేడా! అందుకే చంద్రబాబు కాంగ్రెస్ నాయకులను ఎక్కువగా పార్టీలో చేర్చుకుంటున్నాడని చెప్పాడు. అప్పుడే సర్వర్ బిల్లు తెచ్చి టేబుల్ మీద పెట్టాడు. వెయ్యి రూపాయలు వుంది... ఆ బిల్లు చూసి భేతాళుడు చెప్పా పెట్టకుండా తుర్రుమన్నాడు. విక్రమార్కుడు మాత్రం డబ్బుల కోసం జేబులు తడుము కోసాగాడు.

# దేశప్రగతికి విద్యార్థులే కీలకం

## - ప్రముఖ పారిశ్రామికవేత్త వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి




దేశ ప్రగతికి విద్యార్థులు ఎంతో కీలకమని, విద్యాప్రతిభతో వారు బాగా రాణించాలని ప్రముఖ దాత, పారిశ్రామికవేత్త వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి ఆకాంక్షించారు. 67వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని బుచ్చిరెడ్డిపాళెంలోని రామచంద్రాపురంలో వున్న గుత్తికొండ శ్రీరాములు విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఈ నెల 26న నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని, పతాకావిష్కరణ గావించారు. గత పాతికేళ్ళుగా ఈ విద్యాసంస్థల సెక్రటరీ -కరెస్పాండెంట్‌గా వున్న ప్రముఖ విద్యావేత్త దోనిపర్తి వెంకయ్య ఆధ్వర్యంలో ఈ విద్యాసంస్థలు చదువుల తల్లి నిలయాలుగా మారి ఎంతోమందికి విద్యను బోధిస్తుండడం ఎంతో సంతోషకరమన్నారు. ఈ విద్యాసంస్థల అభివృద్ధికి విద్యావేత్త దోనిపర్తి వెంకయ్య చేస్తున్న సేవలు ప్రశంసనీయమని వేమిరెడ్డి ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న 'లాయర్' వారపత్రిక సంపాదకుడు తుంగా శివప్రభాత్‌రెడ్డి మాట్లాడుతూ, సమాజంలో ఎవరి మతం వారికి ఆరాధనీయంగా వున్నప్పటికీ, సేవ అనే మతం మాత్రం అన్ని మతాల వారికీ సమ్మతమైనదేనని, కులమతాలకు అతీతమైన సేవా హృదయం కల సహృదయుడు, సమాజ సేవా పరాయణుడు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి ఇక్కడకు విచ్చేయడం ఈ విద్యాసంస్థలకు ఎంతో శుభపరిణామమన్నారు. విపిఆర్ చేపడుతున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా త్వరలో విపిఆర్ విద్య, విపిఆర్ వైద్యం కూడా కార్పొరేట్ స్థాయిలో అందరికీ ఉచితంగా అందించేందుకు కృషి జరుగుతోందన్నారు. విద్యాసంస్థల అధినేత దోనిపర్తి వెంకయ్య ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించి మాట్లాడుతూ, వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి తదితరులంతా ఈ కార్యక్రమానికి విచ్చేయడం ఎంతో ఆనందదాయకం అన్నారు. అనంతరం వేమిరెడ్డి ప్రభాకరరెడ్డిని, మురళీకృష్ణ హోటల్స్ ఎం.డి వీరిశెట్టి హజరత్‌బాబును, తుంగా శివప్రభాత్‌రెడ్డిని, సీనియర్ సర్జన్ పి.గంగాధరరావును దోనిపర్తి వెంకయ్య ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల జాయింట్ సెక్రటరీ ఎం.సి పెంచలయ్య, కమిటీ సభ్యులు సిహెచ్ చలమయ్య, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ పి.సీతారామనాయుడు, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎస్ విద్యాసాగర్, ఆంధ్రాబ్యాంక్ విశ్రాంత మేనేజర్ సి.వెంకటరత్నం, లెక్చరర్ శైలజ పాల్గొన్నారు. సహస్ర సభాసింహం బివి నరసింహం సభను నిర్వహించారు.

# నెల్లూరు కీర్తి కెరటానికి రాష్ట్రపతి పురస్కారం



ఏ దేశంలో వున్నా, ఏ రాష్ట్రంలో వున్నా, ఏ నేలపై కాలు పెట్టినా నెల్లూరీయులు తమ ప్రతిభాపాటవాలతో తమ గడ్డకు కీర్తి ప్రతిష్టలు తెస్తూనే ఉంటారు. ఇలాంటి కీర్తి శిఖరమే మువ్వా చంద్రశేఖర్. కర్నాటక రాష్ట్రంలో మంగళూరు పోలీసు కమిషనర్. నెల్లూరుజిల్లా సంగం మండలంలోని కొండమీద కొండూరు ఆయన సొంతూరు. తండ్రి మువ్వా బలరామయ్యనాయుడు. ప్రస్తుతం వీరి కుటుంబం నెల్లూరు, మాగుంట లే అవుట్‌లో ఉంటుంది. కన్నడ నాట పోలీసుశాఖలో నీతికి, న్యాయానికి, ధర్మానికి ప్రతిరూపంగా పేరు తెచ్చుకున్న చంద్రశేఖర్‌కు గణతంత్ర దినోత్సవం సందర్భంగా భారత ప్రభుత్వం రాష్ట్రపతి పురస్కారాన్ని ప్రకటించింది. ఇది ప్రతి నెల్లూరీయుడికి దక్కిన సత్కారం.

కష్టపడే తత్వానికి కేరాఫ్ అడ్రస్ మువ్వా చంద్రశేఖర్. కొండ మీద కొండూరు మొనగాడు. ఊరుపేరుకు తగ్గట్లే తన కృషితో కొండల్లాంటి ఎన్నో లక్ష్యాలను అవలీలగా అధిగమించాడు. అతని విద్యాభ్యాసం ఎక్కువుగా నెల్లూరు, చెన్నైలలో సాగింది. పశ్చిమ బెంగాల్‌లోని ఖరగ్‌పూర్‌లో ఐఐటి పూర్తి చేసి, బెంగుళూరు ఇన్ఫోసిస్‌లో ఒకటిన్నరేడాది పాటు ఐ.టి ఇంజనీరింగ్‌గా సేవలందించారు. కాని ఆ ఉద్యోగంలో ఆయనకు తృప్తి లేదు. తన కోసం తాను బ్రతకడం కాదు, పదిమంది బాగు కోసం తన జీవితం వుండాలని ఆలోచించాడు. ఆ ఆలోచనతోనే యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షలకు ప్రిపేరయ్యాడు. 1998లో తొలి ప్రయత్నంలోనే సివిల్స్‌లో 47వ ర్యాంకు సాధించారు. కేవలం 24ఏళ్ల వయసులోనే ఐపిఎస్ సాధించి తన మేధాశక్తిని చాటుకున్నారు. హిమాచల్‌ప్రదేశ్‌లో ప్రొబేషనరీ ఏఎస్పీగా పోలీసు విధులను ప్రారంభించారు. ఏడాదిన్నర కాలం పాటూ రాజభవన్ ఏడిసిగాను, మూడేళ్ల పాటూ బిలాస్‌పూర్ ఎస్పీగాను సమర్థవంతంగా విధులు నిర్వర్తించారు. బెంగుళూరులోని డిజిపి కార్యాలయంలో అంతర్గత భద్రతా విభాగం ఎస్పీగా కొంతకాలం పని చేశారు. తదుపరికాలంలో బెంగుళూరు తూర్పు విభాగం డిసిపిగా పనిచేసి నేరాలకు కళ్లెం వేసి, ఎంతోమంది నేరస్తులకు సంకెళ్లు బిగించారు. వైట్‌కాలర్ నేరాలను అరికట్టడం లోనూ, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని నేరాలను నియంత్రించడంలోనూ ఆయన సిద్ధహస్తుడు. ఏ హోదాలో విధి నిర్వహణ చేస్తున్నా ఆ హోదాకే హూందాతనం తెచ్చిన ఘనత ఆయనది. ఆయన ఏ బాధ్యతలో వున్నా సమర్థవంతంగా రాణించారు. ప్రస్తుతం మంగుళూరు కమిషనర్‌గా పనిచేస్తూ నేరగాళ్ల పాలిట సింహస్వప్నమయ్యారు. అత్యంత ప్రతిష్టాత్మక రాష్ట్రపతి పురస్కారానికి ఎంపికై నెల్లూరు కీర్తి పతాకను రెపరెపలాడించిన మువ్వా చంద్రశేఖర్‌కు 'లాయర్' అభినందనలు.

# మాడరన్‌లో టాలెంట్ ఎక్స్‌పో



గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 26న నెల్లూరు సరస్వతీనగర్‌లోని మాడరన్ స్కూల్లో "మల్టీ టాలెంట్ ఎక్స్‌పో-2016"ను అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్లేక్లాసు నుండి పదవ తరగతి వరకు విద్యార్థినీవిద్యార్థులు అన్ని సబ్జెక్టులకు సంబంధించిన దాదాపు 800 నమూనాలను ప్రదర్శనలో వుంచడమే కాకుండా, ఆహూతులకు వాటి గురించి చక్కగా వివరించారు. ర్యాకెట్ లాంచర్, బర్నింగ్ ట్రైనను సెన్సార్‌ల ద్వారా మంటలను అదుపుచేయడం, మోడరన్ అగ్రికల్చరల్ మెథడ్స్, మ్యాజిక్ ఫంక్షన్స్, ఉప్పు నీటితో కరెంటును తయారు చేయడం వంటి నమూనాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. మాజీఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, మున్సిపల్ మంత్రి ఓఎస్‌డి సి.హెచ్.పెంచలరెడ్డి, నెప్మా అధ్యక్షులు బి.మనోహర్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.వి.సుబ్బారెడ్డిలు ఈ ప్రదర్శనను తిలకించి విద్యార్థుల ప్రతిభను అభినందించారు. మాడరన్ స్కూలు కరస్పాండెంట్ వాకాటి విజయకుమార్‌రెడ్డి, ప్రిన్సిపాల్ రవికుమార్‌లు ప్రదర్శనను పర్యవేక్షించారు.

# యంఎస్ఆర్ సేవాసమితి వారి గణతంత్ర వేడుకలు



నెల్లూరు బి.వి.నగర్‌లోని కెఎన్ఆర్ మున్సిపల్ హైస్కూల్ నందు మాగుంట శరత్‌చంద్రారెడ్డి యువజన సేవాసమితి ఆధ్వర్యంలో 26వ తేదీ 67వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. రిపబ్లిక్ డే సందర్భంగా మాగుంట శరత్ చంద్రారెడ్డి ఆధ్వర్యంలో సమితి సభ్యులు కొన్ని మంచి నిర్ణయాలు తీసుకున్నారు. ప్రతి ఒక్కరం జెండా వందనంలో పాల్గొంటామని, మద్యపానానికి దూరంగా ఉంటామని, కులమతాలను మరచిపోతామని, విదేశీ వస్తువులను కొనబోమని, పరిశుభ్రతను పాటిస్తామని శపథం చేశారు. ఈ సందర్భంగా సమితి సభ్యులు ఎం.బాబు, షణ్ముఖ, రాజేష్, నౌషాద్, మనోజ్, రహీంలు విద్యార్థులకు స్వీట్లు పంచారు. స్కూల్ ప్రాంగణాన్ని శుభ్రపరిచారు.

# విఆర్‌సి వాకర్స్ రిపబ్లిక్‌డే



ఈ నెల 26న నెల్లూరు విఆర్‌సి మైదానంలో విఆర్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రిపబ్లిక్‌డే వేడుకలను నిర్వహించారు. వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పందిళ్ళపల్లి పట్టాభిరామిరెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి వందనం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ భాస్కర్‌రావు, డాక్టర్ పెంచలయ్య, జె.వెంకటేశ్వరరావు, అసోసియేషన్ కార్యదర్శి రమణమూర్తి, కోశాధికారి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# వైద్య సేవలు విస్తృతం కావాలి



పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా కావలి ప్రాంతానికి వైద్యసేవలు విస్తృతం కావాల్సిన అవసరం ఉందని తెలుగు దేశంపార్టీ జిల్లా అధ్యక్షులు, శాసనమండలి సభ్యులు బీద రవిచంద్ర పేర్కొన్నారు.

సోమవారం ఉదయం జెండాచెట్టు సెంటర్ వద్ద కావలి సొసైటి మాజీ అధ్యక్షులు, మత్స్యకార నేత కొండూరు మునెయ్య కుమారుడు డాక్టర్ బాబూకిరణ్, డాక్టర్ పద్మావతి కిరణ్‌లు నిర్మించిన కె.ఎం.హెచ్ ఆసుపత్రిని బీద రవిచంద్ర, ఆయన సోదరుడు, రాజధాని నిర్మాణ కమిటీ సభ్యులు బీద మస్తాన్‌రావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రవిచంద్ర మాట్లాడుతూ అత్యవసర సమయాలలో దూరప్రాంతాలకు పోకుండా ఉండేలా కావలి ప్రాంతంలో ఆధునిక వైద్య సేవలను అందించాలని కోరారు.

బీద మస్తాన్‌రావు మాట్లాడుతూ ఇతర ప్రాంతాలకు పోతే ఆర్థికంగా మరింత లాభపడే అవకాశాలు ఉన్నా, కావలి వాసులుగా కావలి ప్రాంతంలోనే వైద్యసేవలు అందించడం అభినందనీయమని డాక్టర్ బాబూకిరణ్, డాక్టర్ పద్మావతి కిరణ్‌లను అభినందించారు. డాక్టర్ బాబూకిరణ్ మాట్లాడుతూ ఆధునిక వైద్య సౌకర్యాలతో తమ తండ్రి కొండూరు మునెయ్య పేరుతో ఏర్పాటు చేసిన ఆసుపత్రిలో 24గంటలు అన్ని రకాల వైద్యసేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఆసుపత్రి ప్రారంభోత్సవ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ అలేఖ్య, ఇన్‌ఛార్జి ఛైర్మన్ భరత్, కావలి ప్రాంతానికి చెందిన పలు రంగాల ప్రముఖులు, వైద్యులు పాల్గొని అభినందనలు తెలిపారు.



## కావలి కబుర్లు

# విశ్వసాయి అవగాహన సదస్సు




కావలి టిటిడి కల్యాణ మండపంలో పదవ తరగతి విద్యార్థులకు నెల్లూరు విశ్వసాయి విద్యాసంస్థల అవగాహన సదస్సు మంగళవారం మధ్యాహ్నం జరిగింది. ఈ సదస్సులో విద్యాసంస్థల అధ్యాపక, అధ్యాపకేతర బృందం పాల్గొంది. పదవ తరగతి తరువాత తీసుకోవలసిన కోర్సులు, గమనించవలసిన అంశాలు, లక్ష్యాన్ని చేరుకోవడానికి అనుసరించవలసిన విధి విధానాలపై విశ్వసాయి విద్యాసంస్థల డైరెక్టర్ జి.కృష్ణమోహన్ విద్యార్థులకు చక్కని అవగాహన కల్పించారు. విశ్వసాయి విద్యాసంస్థల తరఫున కెమిస్ట్రీ లెక్చరర్ బాలాజీబాబు, ఫిజిక్స్ లెక్చరర్ రంగనాథ్, మాథమెటిక్స్ లెక్చరర్ అహమ్మద్, ఆయా సబ్జెక్టుల్లో తెలుసుకోవలసిన మెలకువలు సోదాహరణంగా వివరించారు. బైపిసి మరియు ఎంపిసి తర్వాత వివిధ అవకాశాలను చర్చించారు. ఈ సదస్సు ముందు జరిగిన ప్రతిభా పరీక్షల్లో విజేతలయిన విద్యార్థినీ, విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సదస్సులో కావలి పట్టణానికి చెందిన అనేకమంది విద్యార్థినీ విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని విశ్వసాయి జనరల్ మేనేజర్ రాజేష్‌కుమార్, ప్రిన్సిపాల్ బ్రహ్మయ్య నిర్వహించారు.

# బాబును మించిన బాబు

(మొదటి పేజీ తరువాయి)

పసిగట్టి అతడిని పార్టీకే కాదు, తమ కుటుంబానికి కూడా దూరంగా పెడుతూ వచ్చాడు. 2014ఎన్నికల్లో ఇంట్లో మనిషి జూనియర్‌ను కాదని, శత్రువు ఇంట్లో వున్న పవన్ కల్యాణ్‌ను గడ్డం పట్టుకుని బతిమాలి ప్రచారంకు తెచ్చుకున్నది జూనియర్‌ను అణచడానికే! ఇదంతా కూడా లోకేష్‌కు ఎవరూ అడ్డం రాకుండా చేసిన ప్రయత్నమే! పార్టీ పరంగా జూనియర్ ఎన్టీఆర్‌ను ప్రచారంలో దింపినా, రాజకీయంగా ఎదగనిచ్చినా భవిష్యత్‌లో ఆ పిల్లగాడు ఇది నా తాత పెట్టిన పార్టీ, నాకే సొంతం అని అడ్డం తిరిగే అవకాశం వుంది. కాబట్టే జూనియర్‌ను చంద్రబాబు చాలా తెలివిగా తప్పించాడు.

తెలుగుదేశం బాధ్యతలను తన కుమారుడికి ఇప్పించాలనుకుని చంద్రబాబు చేసిన ప్రయత్నాలన్నీ ఫలించాయి. ఇప్పుడు లోకేష్ పార్టీలోనే కాదు, ప్రభుత్వంలోనూ కీలక పాత్రధారుడయ్యాడు. పార్టీ కార్యక్రమాలు చాలావరకు లోకేషే చూస్తున్నాడు. ప్రభుత్వ పరంగా ఆర్థిక లావాదేవీలతో సంబంధమున్న పనులన్నీ కూడా ఆయనే పర్యవేక్షిస్తున్నట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో ఉన్నతాధికారుల బదిలీలలో సైతం చినబాబు హస్తముంటుంది. రాష్ట్ర పరిపాలనా వ్యవహారాలన్నీ కూడా చంద్రబాబు కంటే చినబాబు ఆదేశాలతోనే జరుగుతున్నాయని సమాచారం. లోకేష్‌కు ఉన్నఫళంగా ఇంత ప్రచారం తేవడం వెనుక ఒక కారణం కనిపిస్తోంది. లోకేష్‌కు రాష్ట్ర బాధ్యతలు అప్పగించి చంద్రబాబు ఢిల్లీలో చక్రం తిప్పాలనుకుంటున్నాడని కొందరి అభిప్రాయం. ములాయంసింగ్ యాదవ్ తన కొడుకును యూపీ సీఎం పీఠంపై కూర్చోబెట్టి ఇప్పుడు ఢిల్లీ పీఠం కోసం చూస్తున్నాడు. బీహార్‌లో లాలూప్రసాద్‌యాదవ్ కూడా తన కొడుకును డిప్యూటీ సీఎంను చేయడం తెలిసిందే! చంద్రబాబుకు కూడా ఢిల్లీ రాజకీయాలపై మనసుపడ్డట్లుంది. 1996లో యూనైటెడ్ ఫ్రంట్ హయాంలోనే ఆయనకు ప్రధానిగా ఛాన్స్ వచ్చింది. అయితే ఆరోజుకు తెలివైన వాడు కాబట్టి ముందుచూపుతో వద్దన్నాడు. కాని ఈరోజు ఆయన వయసు రీత్యా అలాంటి అవకాశం వస్తే వదులుకోవాల్సిన పనిలేదు. కేంద్రంలో ఎప్పుడు రాజకీయ పరిస్థితులు ఎలా మారుతాయో ఎవరూ చెప్పలేరు. ఈరోజు ఎన్డీఏ వుంది... రేపు హంగ్ రావచ్చు. మళ్ళీ ఫ్రంట్ అవసరం రావచ్చు... చంద్రబాబుకు చక్రం తిప్పే ఛాన్స్ రావచ్చు. అందుకే ఆయన ఏపికి తన కొడుకు లోకేష్‌ను ముస్తాబు చేస్తున్నాడని అందరికీ అర్థమవుతుంది.

# తెలుగు అక్షరానికి...అత్యున్నత గౌరవం

(మొదటి పేజీ తరువాయి)

గుడివాడలో బిఏస్సీ వరకు చదివాడు. ఢిల్లీలోని ఓ యాడ్ ఏజన్సీలో మొదట ఆర్టిస్ట్‌గా ఉద్యోగంలో చేరాడు. 1961లో రమాదేవితో వివాహమైంది. 1962లో హైదరాబాద్‌కొచ్చి మార్గదర్శి చిట్‌ఫండ్స్‌ను స్థాపించాడు. 1965లో కిరణ్ యాడ్స్ ఏజన్సీని ప్రారంభించాడు. 1967లో వసుంధర ఫెర్టిలైజర్స్ పేరుతో ఖమ్మంలో ఎరువుల వ్యాపారాన్ని మొదలుపెట్టాడు. 1969లో రైతులకు తనవంతు సేవలం దించాలనే తపనతో 'అన్నదాత' పత్రికను ప్రారంభించాడు. 1973లో విశాఖ పట్నంలో డాల్ఫిన్ హోటల్‌ను ప్రారంభి చాడు. ప్రారంభించినప్పుడు ఇవన్నీకూడా చిన్నచిన్న సంస్థలు. చిన్న చిన్న వ్యాపారాలే! కాని తర్వాత విస్తరించిన రామోజీ వ్యాపార సామ్రాజ్యంలో ఇవన్నీ కూడా ప్రధాన భాగాలయ్యాయి. 1974లో విశాఖ కేంద్రంగా 'ఈనాడు' దినపత్రికను స్థాపించ డమే రామోజీ వ్యక్తిగత జీవితంలో పెద్ద మలుపు. అప్పుడే మార్గదర్శి మార్కెటింగ్ ప్రైవేట్ లిమిటెడ్‌ను కూడా ప్రారంభి చారు. 1975లో హైదరాబాద్‌లోనూ 'ఈనాడు' ఎడిషన్ మొదలైంది. ఆ తర్వాత అది అంచెలంచెలుగా పాకింది. తెలుగు పత్రికా రంగంలో పెనుమార్పులు చోటు చేసుకుంది 'ఈనాడు' రావడంతోనే! తొలి సారిగా పంచరంగుల్లో రావడం గాని, జిల్లాల వారీగా టాబ్లాయిడ్‌లు ప్రచురిం చడం, తర్వాత నియోజకవర్గాలు, జోన్‌లు వారీగా పేజీలు కేటాయించే సంస్కృతికి కూడా పునాది వేసింది రామోజీరావే! 1995లో ఈటీవీ స్థాపించాడు. ఆ తర్వాత ఈ టీవీ న్యూస్ ఛానల్స్‌తో పాటు పలు బాషలలో ఈ టీవీ ఛానల్స్ శాఖోపశాఖ లుగా విస్తరించాయి. ఇక సినీరంగంలో ఆయనది ప్రత్యేక ముద్ర. ఉషాకిరణ్ మూవీస్ అధినేతగా 87 తెలుగు సినిమాలు నిర్మించారు. చాలా తక్కువ బడ్జెట్‌తో సూపర్‌హిట్ చిత్రాలు నిర్మించడం ఆయ నకే చెల్లింది. ఇక హైదరాబాద్‌లో నిర్మిం చిన రామోజీ ఫిలింసిటీ గాని, ప్రస్తుతం నిర్మాణంలో వున్న 'ఓం సిటీ' గాని ఆయన కృషికి ప్రతిరూపాలు. ఆయన శ్రమను, ఆయన ఎదుగుదలను, ఆయనలోని క్రమశిక్షణను గురించి వ్రాసుకుంటూ పోతే 'ఈనాడు' పత్రికలోని పేజీలన్నీ కూడా ప్రతిరోజూ కేటాయించినా చాలవు. సీరియల్స్‌గా తీస్తే ప్రతిరోజూ ఓ గంట ఎపిసోడ్ వేసినా ముగియడానికి కొన్నేళ్ళు పడుతుంది. ఒక మనిషి తలచుకుంటే ఇన్ని పనులు చేయగలడా అనేందుకే కాదు, ఇన్ని విజయాలు సాధించగలడా అనేందుకు నిలువెత్తు సాక్ష్యం రామోజీరావు.

ఇవన్నీ ఒకెత్తు... ఆంధ్రప్రదేశ్ రాజకీయ చిత్రపటంపై ఆయన శాసనం మరో ఎత్తు. రాష్ట్రంలో పాలకులు ఎవరున్నా, వారిని శాసించేది రామోజీరావే అన్న ప్రచారం వుంది. ముఖ్యంగా తెలుగుదేశం ప్రభుత్వ విధానాలపై ఆయన ప్రభావం చాలానే వుంటుంది. 1983లో ఎన్టీఆర్ ప్రభంజనాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంలోనూ, 1985లో ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పడ్డప్పుడు ఆయనకు మద్దతుగా ప్రజాబలం కూడగట్ట డంలోనూ రామోజీ వార్తల పాత్ర చాలా కీలకంగా పనిచేసింది. 1995లో అదే ఎన్టీఆర్‌కు అల్లుడు చంద్రబాబు వెన్నుపోటు పొడిచినప్పుడు ఎన్టీఆర్‌కు కాకుండా చంద్ర బాబుకు వెన్నుదన్నుగా నిలిచిన రామోజీ చాణక్యం భవిష్యత్ రాజకీయ పరిస్థితులకు తగినట్లే వుండింది. కాంగ్రెస్ వ్యతిరేకిగా తెలుగుదేశం పక్షపాతిగా ఆయన మీద ముద్ర ఉన్నప్పటికీ తాను వ్రాసిందే అక్షర సత్యమని తెలుగు ప్రజలను నమ్మించిన ధీశాలి రామోజీరావు. ఈరోజుకు కూడా ఆంధ్రప్రదేశ్‌లో ఎన్ని దినపత్రికలున్నా 'ఈనాడు'లో వచ్చిందే నిజమైన వార్తని ప్రజలు నమ్మే పరిస్థితి వుందంటే రామోజీ కనికట్టు అలాంటిది. ఇప్పుడిచ్చిన 'పద్మ విభూషణ్' బిరుదు ఆయనకెప్పుడో వరించి వుండాలి. కాకపోతే కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో ఆయనను రాజకీయ కోణంలో తప్పితే మిగతా కోణాలలో చూడలేదు. ఇప్పుడున్న ప్రభుత్వమైనా అన్ని కోణాల్లో ఆయన కృషిని గుర్తించి ఈ విభీషణుడికి పద్మవిభూషణ్ బిరుదుతో సత్కరించడం సంతోషించదగ్గ విషయం. తెలుగు మీడియా శిఖరం రామోజీకి 'లాయర్' అభినందనలు.

# లీడర్లకూ ఇసుక ఫోబియా

(మొదటి పేజీ తరువాయి)

పడమటపాలెం, సజ్జాపురం, అప్పారావు పాలెం, గొల్లకందుకూరు, నూతక్కివారి కండ్రిక, పుచ్చలపల్లి, చిగురుపాడు, కోల గట్ల రీచ్‌లకు మాత్రమే పర్యావరణ అనుమతులున్నాయి. అనుమతి లేని రీచ్ లకు కూడా టెండర్లు నిర్వహిస్తుండడంపై పర్యావరణ నిపుణులు మండి పడుతు న్నారు. ఇసుక వ్యాపారంలో గతంలో ఎన్నడూ లేనంతగా ఇప్పుడు రాజకీయాలు జొరబడ్డాయి. గతంలో ఇసుక రీచ్‌లకు ఎప్పుడు వేలం పాటలు జరిగినా ప్రజా ప్రతినిధులు గాని, అధికారపార్టీ నాయకులు గాని స్వయంగా తల దూర్చిన దాఖలాలు లేవు. పదేళ్ల జిల్లాలో ఆనం వాళ్ళు రాజ్య మేలినా తమ అనుచరులకు రీచ్‌లు రావ డంలో దోహదపడ్డారు. తమకు వ్యతి రేకంగా వున్నోళ్లకు రీచ్‌లు వస్తే అడ్డుకు న్నారేగాని, వాళ్ళు సొంతంగా ఇసుక వ్యాపారంలోకి దిగింది లేదు. ఇప్పుడు మాత్రం అధికారపార్టీ ఎమ్మెల్యేలు, లేదా ఇన్‌ఛార్జ్‌లు తమ తమ నియోజకవర్గాల పరిధిలోకి వచ్చే ఇసుక రీచ్‌లను తమ గుప్పిట్లోనే ఉంచుకునే ప్రయత్నం చేస్తు న్నారు. ఈ విధంగా సిండికేట్లు కూడా ఏర్పాటు చేస్తున్నారు. నెల్లూరురూరల్, కోవూరు, ఆత్మకూరు, వెంకటగిరి, సర్వేపల్లి నియోజకవర్గాల పరిధిలో మొత్తం ఇసుక రీచ్‌లు వున్నాయి. ఇసుక సిండికేట్ల విష యంలో అధికారపార్టీ నాయకులు చక్రం తిప్పుతున్నారు. ఒక్కో నాయకుడు తమ పరిధిలో వున్న రీచ్‌లకు ఎవరినీ టెండర్లు వేయవద్దని కోరుతూ, ముఖ్యమైన వారితో సిండికేట్లు కడుతున్నారు. ఎవరు ఏ రీచ్‌కు టెండర్ వేయాలనేదానిపై నాయకులు ఒక అవగాహనకు వచ్చినట్లు సమాచారం. ఈ-టెండర్ల ద్వారా టెండర్లను తీసుకున్నా కూడా స్థానిక నాయకుల అనుమతి లేనిదే ఇసుక రీచ్‌లను నిర్వహించుకునే అవకాశం లేకపోవడంతో టెండర్లు వేయాలనుకున్న వ్యాపారులు నాయకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. మొత్తానికి ఇసుక వ్యాపారాన్ని ప్రభుత్వం పసుపుమయం చేసేసింది.

# సురభికి నంది అవార్డు



నెల్లూరీయుడు, సురభి నాటక రంగ వారసుడు, ప్రముఖ మేకప్‌మెన్ సురభి లక్ష్మీకాంత్ రజత నంది అవార్డు సాధించి నెల్లూరుకే గర్వకారణమయ్యాడు. రాష్ట్ర చలనచిత్ర టివి, నాటక రంగ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 18 నుండి 27వరకు రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన నంది నాటకోత్సవం 2015కు గాను నెల్లూరు క్రాంతి ఆర్ట్స్ థియేటర్ వారు ప్రదర్శించిన 'పరుసవేది' సాంఘీక నాటకానికి గాను ఉత్తమ మేకప్ రజత నంది అవార్డు, రూ.15వేలు నగదు బహుమతి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేతుల మీదుగా అందుకున్నాడు.

# నెల్లూరు కవులను మరిచారా..?

ఫ్లెమింగో ఫెస్టివల్ తొలిసారిగా రాష్ట్ర పండుగగా ప్రకటించిన నేపథ్యంలో జరిగిన కవితోత్సవం అభాసుపాలైంది. ఫ్లెమింగో ఫెస్టివల్‌లో వలస పక్షులకు నెల్లూరీయులు ఆతిథ్యం ఇవ్వడం ఆనవాయితీగా ఉండేది. కాబట్టి అది నెల్లూరుజిల్లా వాసుల పండుగ అయింది. నెల్లూరు కవులకు గర్వకారణమైన పండుగ అయింది. కవితోత్సవమ్ అని ప్రకటించగానే నెల్లూరుజిల్లా కవులు, రచయితలు తమ కలాల్ని కదిలించారు. కానీ నెల్లూరీయులకు, నెల్లూరుజిల్లా కవులకు, రచయితలకు స్థానం లేని, అవకాశం లేని, ప్రాధాన్యతలేని కవితోత్సవం జరగడం ఒక ఆశనిపాతం! అదేమంటే ఇది దక్షిణాది రాష్ట్రాల కవిసమ్మేళనం అని ప్రకటించారు. నెల్లూరు రచయిత సంఘాల్లోని కవుల్ని విస్మరించ డానికి దక్షిణాది రాష్ట్రాల కవిసమ్మేళనంగా ప్రకటించిన ఘనత నిర్వాహ కులది. దానికి ప్రభుత్వ యంత్రాంగం, విక్రమ యూనివర్శిటీ అధికారులు కొంగజపం చేసి కవులపై సవాలు విసిరి అవమానించడం శోచనీయం. ఇలా ఎందుకు జరపాల్సి వచ్చిందో అర్థంకాని వెర్రివాజమ్మలయ్యారు నెల్లూరు కవిపుంగవులు.

అసలు నెల్లూరులో కవులనే పదార్థాలు ఉన్నాయా? ఉంటే ఆ పదార్థాల రుచి ఎంతో అభిరుచి వున్న మేధావి వర్గమైన యూనివర్శిటీ అధికారుల్ని తాకాయా? లేదా? అనేది మిలియన్ డాలర్ల ప్రశ్న.

అలా యూనివర్శిటీ గేటునే తాకలేని కవులు వేదికపైకి ఎక్కి కవితోత్సవమ్‌లో ఊరేగాలనుకోవడం సాహసం కాదా? అనేది మరో ప్రశ్న. ఇలా అధికారులు, అనధికారులు నెల్లూరు కవులపై ప్రశ్నల్ని సంధించి యుద్ధం ప్రకటించి వీళ్లతో పని మనకేంటని విస్మరిస్తే పోలా అనే నిర్ణయం తీసుకొన్నట్లు తెలుస్తున్నది. నెల్లూరులో అంతో ఇంతో రాయగలిగిన వాళ్ళు కొందరు, రాష్ట్ర స్థాయి పోటీల్లో కవిత్వం తొడలు చరిచి పోటీల్లో అవార్డులు పొందిన వారు కొందరు, ఏ పోటీ జరిగినా తమ కవితలతో గెలిచేవాళ్ళు కొందరు... అందర్నీ కలిపి ఫ్లెమింగో కవితోత్సవ శుభవేళ జాఫర్ సాహెబ్ కాలువలో ముంచెత్తిన వైచిత్రి, ఘనత పొందిన ఫ్లెమింగో కవితోత్సవమ్‌దే అయ్యింది. 2016లో నెల్లూరు కవుల్ని మీరెందుకూ పనికిరారు భాయ్ పైరవీలు చేయకపోతేనని సందేశం ఇచ్చి వెళ్ళిపోయింది.

'ఇంట గెల్చి రచ్చ గెలవాలనుకొన్నామని' ఎవరైనా గుసగుసలాడితే షటప్ అని అరచి యూనివర్శిటీ పాలకవర్గం కవులకు తొడబెల్లం పెట్టడానికే ఈ కవితోత్సవమ్ ఏర్పాటు చేసినట్లుగా కవులు అనుకోవాల్సి వుంది. దీన్నిబట్టి చూస్తే రాబోయే కవితోత్సవాల్లో, కవిసమ్మేళనాల్లో ఎవరూ ఏంటని ప్రశ్నించకుండా 'షటప్'చేస్తేయ్యమని నెల్లూరు జిల్లా కవులకు అల్టిమేటమ్ జారీ చేసినట్లయ్యింది.

వోట్లేయలేదని నెల్లూరుజిల్లాపై ముఖ్యమంత్రి చంద్రబాబు సీత కన్నేశాడని విన్నాం గాని చూశాం గాని ప్రభుత్వ పాలనాయంత్రాంగం యూనివర్శిటీ అధికారులు అందరూ కలసి ఇలాంటి కళ్ళతోనే చూసి కళ్ళాపిచల్లి తమ హ్రస్వదృష్టిని ఇలా బాహాటంగా ప్రదర్శిస్తుంటారని అనుకోలేదు. కవితోత్సవమ్ ముగిసిన తర్వాతగానీ ఇక్కడోళ్ళకు అర్థం కాకపోవడానికి కారణం ఇక్కడి కవులకు దూరదృష్టి, దార్శనికత లేకపోవడమేనని తేల్చి చెప్పడం నెల్లూరు కవుల భవిష్యత్తు దృష్టానేనని అనుకోరెందుకని అధికారుల్ని అర్థం చేసుకొంటే పోలా?

దార్శనికత లేని కవులందరూ షటప్ అయిపోవాల్సింది పోయి ప్రభుత్వాన్ని ప్రశ్నించడం ఏంటో అర్థం కాదు. అందుకే అందరూ పక్షుల్లా సైలెంట్ అయిపోయి పరాయి దేశాలకు వెళ్ళినట్లు పడకేయమని సందేశాన్ని ప్రశ్నిస్తే ఎలా? మరీ హద్దు మీరితే వచ్చే ఫ్లెమింగో ఫెస్టివల్‌కు ఉత్తర దేశాల కవి సమ్మేళనం పెడితే అడ్డుకొనే వాళ్లెవరైనా ఉన్నారా? అంత సత్తా ఎవరకుందని యూనివర్శిటీ అధికార్లు ప్రశ్నిస్తున్నారు. కోటి రూపాయల్ని ఎత్తి పాములకాల్వలో పడేసి తూతూ మంత్రంగా కుర్చీలకు, బెంచీలకు ఫ్లెమింగో' ఫెస్టివల్‌ను నిర్వహించిన ప్రభుత్వ యంత్రాంగానికీ నెల్లూరీయుల ఘనచరితను ఎలా చాటాలో ప్రత్యేకించి నేర్పాలా?

పోయిన దఫా నెల్లూర్లో నంది నాటకోత్సవాలు జరిగినప్పుడు కలెక్టరు రాంగోపాల్ నెల్లూరీయుల్ని భాగస్వాముల్ని చేసి తప్పు చేసేసాడేమో ననేమో ఇప్పుడు దిద్దుబాటు చర్యలు చేపట్టినట్లుగా ఉందని నెల్లూరు కవుల్లో చర్చ సాగుతున్నది. విక్రమ యూనివర్శిటీ క్యాంపస్ విఆర్ హైస్కూలు గ్రౌండు చివర ఉండడంతో కవుల గోడు విన్పించనంత దూరం పెరిగిందేమోనని మరో ఆలోచన. కవి తిక్కన పేరు మీద ప్రారంభం కావాల్సిన విశ్వవిద్యాలయం అసంబద్ధంగా విక్రమ సింహపురిగా వెలవడంతో కవులను పరికించే 'కన్ను దన్ను' కరు వైందేమోనని మరో ఊహ. మొత్తానికి నెల్లూరు కవుల్ని చేతకాని దద్దమ్మల్ని చేసి ఫ్లెమింగో కవితోత్సవమ్ అలా పరుగులిడుతూ వెళ్ళిపోయింది. కవితాత్మలే ఇప్పుడు క్షోభిస్తున్నాయి! ఆవేదన చెందు తున్నాయి!! జిల్లా కలెక్టరు శ్రీమతి ఎం.జానకి గారు కలుగ జేసుకోవా లని కోరుతున్నాయి.

## వేలాది విద్యార్థుల సంతకాలతో

# స్వచ్ఛభారత్ ప్రతిజ్ఞాపత్రాలు

- కళకళలాడిన స్వర్ణభారత్ అక్షర విద్యాలయం








గణతంత్ర దినోత్సవం నాడు వెంకటాచలం మండలంలోని స్వర్ణభారత్ అక్షర విద్యాలయం వేలాదిమంది విద్యార్థులు, అనేకమంది ప్రముఖులు, జిల్లా అధికారులతో కళకళలాడింది. ఈ సందర్భంగా, అక్షర ప్రాంగణంలో స్వచ్ఛభారత్‌లో భాగస్వాములను చేస్తూ 33వేల మంది సంతకాలు చేసి, చేతిముద్రలు వేసి, ఎనిమిది అంకె ఆకారంలో ఏకీకృతం చేసి ఏర్పాటు చేసిన స్వచ్ఛభారత్ ప్రతిజ్ఞా పత్రాలతో ఆ ప్రాంగణమంతా సందడిగా మారింది. స్వర్ణభారత్ మేనేజింగ్ ట్రస్టీ దీపా వెంకట్ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన ఈ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ శ్రీమతి ఎం.జానకి పాల్గొని పరిశీలించారు. గణిత విధానంలో స్వచ్ఛభారత్‌పై ప్రతిజ్ఞ చేయించే విధానాన్ని ఆమె ఆసక్తిగా తిలకించారు. ఈ విధానం ఎంతో బావుందని కలెక్టర్ ఈ సందర్భంగా ప్రశంసించారు. ఆరు రాష్ట్రాల్లోని 33 వేల మంది విద్యార్థులతో ప్రమాణం చేయించి, వారితో సంతకాలు చేయించి ఈ ప్రతిజ్ఞా పత్రాలను ప్రదర్శించడం ఎంతో వినూత్నంగా వుందని ఆమె అభినందించారు. స్వచ్ఛభారత్‌కు అందరి భాగస్వామ్యం అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో దీపా వెంకట్ మాట్లాడుతూ, పరిశుభ్రతతోనే ఆరోగ్యం సాధ్యమన్నారు. స్వచ్ఛభారత్ కోసం ప్రధాని నరేంద్రమోడీ, కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు ఎంతగానో కృషి చేస్తున్నారని అంటూ, ఆ మేరకు విద్యార్థుల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు అక్షర విద్యాలయంలో స్వచ్ఛభారత్ ప్రతిజ్ఞా కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, మేయర్ తదితర ప్రముఖులు స్వచ్ఛభారత్ పత్రాలపై సంతకాలు చేసి చేతిముద్రలు వేశారు. నగర మేయర్ అబ్దుల్ అజీజ్, గూడూరు మునిసిపల్ ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన, శాప్ డైరెక్టర్ రవీంద్రబాబు మాట్లాడుతూ, స్వచ్ఛభారత్ కోసం అందరూ కలసికట్టుగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్త వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, 'లాయర్' వారపత్రిక సంపాదకుడు తుంగా శివప్రభాత్‌రెడ్డి, గణిత విధాన రూపకర్త కాళిదాసు వంశీధర్, అక్షర విద్యాలయ సంచాలకుడు హరగోపాల్, ప్రిన్సిపాల్ కుముద, స్వర్ణభారత్ ట్రస్టు సంచాలకుడు కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా స్థాయిలో ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. జిల్లా స్థాయిలో నిర్వహించిన వ్యాస రచన పోటీల్లోని విజేతలకు ముఖ్యఅతిథుల చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్‌ను, ఈ కార్యక్రమంలో గణిత విధాన రూపకర్త కాళిదాసు వంశీధర్‌ను దీపావెంకట్ సన్మానించి, వారికి జ్ఞాపికలను అందజేశారు.

## అప్పారావుకు ఏషియాటిక్ సొసైటీ అవార్డు



తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర యూనివర్శిటీలో ఆంత్రోపాలజీ హెడ్‌గా పని చేసి రిటైర్డ్ అయిన ప్రొఫెసర్ అళహరి అప్పారావుకు ది ఏషియాటిక్ సొసైటీ అవార్డు లభించింది. ఆంత్రోపాలజీ విభాగంలో ఆయన అందించిన సేవలకుగాను 2015సంవత్సరానికి ఈ అవార్డును ప్రకటించారు. అప్పారావుది నెల్లూరుజిల్లానే. కావలి రూరల్ మండలంలోని తుమ్మలపెంట స్వగ్రామం. ప్రతిష్టాత్మక అవార్డుకు ఎంపికైన అప్పారావుకు 'లాయర్' అభినందనలు.

## 'దేశం'ను విడిచే ప్రసక్తే లేదు!



ఎట్టి పరిస్థితులలోనూ తాను తెలుగుదేశంపార్టీని విడిచే ప్రసక్తేలేదని ఆ పార్టీ నాయకులు ఆనం జయకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. 22.01.2016 'లాయర్' సంచికలో 'జూనియర్స్ ఎటు వైపో' అన్న వార్తకు ఆయన స్పందించారు. తన సోదరుడు ఆనం విజయకుమార్‌రెడ్డితో కలిసి తాను వైకాపాలో చేరాలని ప్రయత్నిస్తున్నట్లు వస్తున్న వార్తలను ఖండించారు. తెలుగుదేశంపార్టీలోకి ఎవరెవరో వస్తుంటారని, వాళ్లెవరో వచ్చారని తాను పార్టీని మార్చాల్సిన పనిలేదని, చంద్రబాబు నాయకత్వంలో పని చేస్తూ ఏ బాధ్యత అప్పగించినా నిర్వర్తించడానికి సిద్ధంగా వున్నానన్నారు.


## సాంవత్సరీకము



మా తండ్రిగారైన
బయ్యా వెంకటరమణయ్య గారి
సాంవత్సరీకము (యేడూడి తిథులు)
తేది. 3-2-2016 బుధవారం
నెల్లూరు, చిన్నబజార్ (న్యూ రాజ్యలక్ష్మి హాల్ ఎదురువీధి), సవరాలవీధిలోని
మా స్వగృహము నందు జరుగును.
కావున తెలియజేయడమైనది.

ఇట్లు కుమారులు
బయ్యా శ్రీనివాసులు (వాసు)
బయ్యా వెంకట రవికుమార్

పంక్తి : తేది. 3-2-2016 బుధవారం
మ॥ 12.00 గం॥లకు నెల్లూరు,
రంగనాయకులపేటలోని ఆర్యవైశ్య బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ కళ్యాణ మండపమునందు

న్యూ రాజ్యలక్ష్మి హాల్ A/c
శుభమస్తు షాపింగ్‌మాల్

## శ్రద్ధాంజలి



జననం: 24.06.1938 మరణం: 21.01.2016

## శ్రీ పర్వతరెడ్డి రవీంద్రరెడ్డి గారు

జనవరి 21వ తేదీ పరమపదించినారు.
వారి ఆత్మశాంతికై ప్రార్థిస్తూ...

- కుటుంబసభ్యులు

MTAR TECHNOLOGIES PVT LTD.

**ఉత్తరక్రియలు:** తే.31-01-2016ది ఆదివారం ఉదయం 11.30గంటలకు హైదరాబాద్, అమీర్‌పేటలోని వారి స్వగృహము నందు జరుగును. బంధుమిత్రులకు తెలియజేయడమైనది.


Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com